MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 21 సంచిక: 6 రంగారెడ్డి ఫిబ్రవరి 2023 పేజీలు : 36 వెల : రూ. 10/-

## గణతంత్ర ఘనపతాక!



పామిడిలో రిపబ్లిక్ దినోత్సవ పతాకావిష్కరణ




1. శ్రీ చిన జీయర్ స్వామి
2. శ్రీ కమలేష్ డి పటేల్
3. శ్రీమతి సుధా మూర్తి
4. శ్రీమతి వాణీ జయరాం
5. శ్రీమతి సుమన్ కళ్యాణ్‌పూర్

## సమతుల అభివృద్ధి కోసం ...



ఏపి ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం




తెలంగాణా వాణిజ్య, పారిశ్రామిక సమాఖ్య 'ఎఫ్ పి ఓలు - పరిశ్రమలు' అనే అంశంపై నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో ప్రసంగిస్తున్న శ్రీ సి ఎస్ రెడ్డి

## రాయలసీమ ఎఫ్ పి ఓల సమ్మేళనం !

04-02-2023 వ తేదీ

అనంతపురంలోని

ఆర్ డి టి ఇన్‌క్లూజివ్ హైస్కూలులో ...

ఏపిమాస్, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ నిర్వహణలో ...

ముఖ్య అతిథి ...

**శ్రీ కాకాణి గోవర్ధనరెడ్డి గారు**

(ఆంధ్రప్రదేశ్ వ్యవసాయం, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, సహకార శాఖ మంత్రివర్యులు)



సిరిధాన్యాల ఖాదర్‌వలీకి పద్మశ్రీ




ఎఫ్ పి ఓల ప్రతినిధులు, వ్యవసాయ పారిశ్రామికవేత్తలతో నాబార్డ్ తెలంగాణా కార్యాలయం నిర్వహించిన సమావేశంలో ప్రసంగిస్తున్న సి జి ఎం శ్రీమతి సుశీల చింతల

PRAGATI OFFSET ప్రగతి ఆఫ్‌సెట్ NABARD నాబార్డ్ సౌజన్యంతో ....

# జీవనోపాధుల బలోపేతం

ప్రత్యామ్నాయ పంటల సాగు పద్ధతులు...
చిన్న, సన్నకారు రైతులకు అదనపు ఆదాయ మార్గాలు

## చేపట్టే పనులు




NABARD

# మహిళా సాధికారత


సంపుటి 21 సంచిక 6



సంపాదకీయం

## సమ్మేళనం !

**చా**లాకాలంగా ఎదురుచూస్తున్న ఒక ఉత్తేజకరమైన రోజు చేరువలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్ రాష్ట్రాలలో ఎఫ్ పి ఓల ప్రోత్సాహక , మార్గదర్శక సంస్థగా గురుతర బాధ్యతను నిర్వహిస్తున్న ఏపిమాస్ సాధ్యమైనన్ని ఎఫ్ పి ఓలను ఒక వేదిక మీదకు తెచ్చి, ప్రభుత్వాల ముఖ్యులతో ముఖాముఖి ఏర్పాటుచేసి, ఆ ఎఫ్ పి ఓల ప్రతినిధులు తమ విజయాలను, సమస్యలను, సవాళ్ళను చర్చించి, కలసికట్టుగా పరిష్కార మార్గాలను , అభివృద్ధి వ్యూహాలను రూపొందించుకుని, మరింత స్వావలంబనతో, మరింత అవగాహనతో , అవసరమైన మేరకు ప్రభుత్వ తోడ్పాటుతో ముందడుగు వేయాలని ఆకాంక్షిస్తున్నది. ఈ దిశగా 2022 మార్చి 26 వ తేదీన ఏపిమాస్ చొరవతో, ఏపిమాస్ నిర్వహణలో హైదరాబాదులో తెలంగాణా రాష్ట్ర స్థాయి ఎఫ్ పి ఓల భాగస్వామ్య సదస్సు జరిగింది. ఈ సదస్సు ఆశించిన ప్రయోజనాల సాధనకు దోహదం చేసింది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎఫ్ పి ఓల సమ్మేళనాన్ని ప్రాంతీయ స్థాయిలోనైనా నిర్వహించాలని, ముందుగా రాయలసీమ సదస్సుతో ప్రారంభించి, వివిధ ప్రాంతీయ సమ్మేళనాలను, అనంతరం రాష్ట్ర స్థాయి మహా సమ్మేళనం నిర్వహించాలని ఏపిమాస్ చాలారోజులుగా గట్టిగా కృషిచేస్తున్నది. ఎట్టకేలకు ఆ కృషి ఫలించి, వచ్చే ఫిబ్రవరి 4 వతేదీన రాయలసీమ ఎఫ్ పి ఓల సమ్మేళనానికి రంగం సర్వం సిద్ధమైంది. అనంతపురం కేంద్రంగా పనిచేసే ప్రసిద్ధ స్వచ్ఛంద సంస్థ ఏ ఎఫ్ ఎకాలజీ సెంటర్‌తో కలసి ఏపిమాస్ ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయం, మార్కెటింగ్, సహకారం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి శ్రీ కాకాణి గోవర్ధనరెడ్డి గారు ఈ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొనడానికి అంగీకరించడం సంతోషకరమైన విషయం. సంబంధిత వివిధ శాఖలకు చెందిన కమిషనర్లు, సి ఇ ఓలు, యితర ముఖ్య అధికారులు, వాణిజ్య, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొననున్నారు. అటు రాయలసీమలోని దాదాపు 120 ఉత్తమ ఎఫ్ పి ఓల నాయకులు, యిటు సంబంధిత శాఖ మంత్రి, ప్రభుత్వంలో కీలక బాధ్యతలను నిర్వహించే ఉన్నతాధికారులు ఈ సమ్మేళనంలో పాల్గొని, ముఖాముఖి చర్చించనుండడంతో ఎఫ్ పి ఓలకు సంబంధించిన పలు సమస్యలు చర్చకు వస్తాయని, వాటిలో చాలావాటికి పరిష్కారాలు ఈ వేదికలోనే లభిస్తాయని ఆశించవచ్చు. కొందరి విజయగాథలు అందరికీ స్ఫూర్తిదాయకం కావచ్చు. కేవలం ఒక ఎఫ్ పి ఓ స్థాయిలో కాకుండా, అవసరాన్ని, అవకాశాన్నిబట్టి వీలున్నన్ని ఎఫ్ పి ఓలు పరస్పరం చేతులు కలిపి ఉమ్మడిగా అభివృద్ధి పథంలో ముందడుగు వేయడానికి ఈ వేదిక ఉత్సాహాన్ని, ప్రోత్సాహాన్ని కలిగించవచ్చు. అందుకు అవసరమైన సాధన సంపత్తిని, వ్యూహాలను కూడా ఈ సమ్మేళనం సమకూరుస్తుందని మనం ఆశించవచ్చు. ఎఫ్ పి ఓల నిరంతరాభివృద్ధి దిశగా ఈ సమ్మేళనం ప్రేరణ కలిగిస్తే, ఆశించిన ప్రయోజనం సిద్ధించినట్టే. ఎఫ్ పి ఓల సి ఇ ఓలు, పాలకవర్గ సభ్యులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని, మరిన్ని మెళకువలను నేర్చుకుని, తమ సంస్థలను అభివృద్ధి పథంలో ముందు వరుసలో నిలపడానికి కృషిచేయాలి. సాంకేతిక, సమాచార విప్లవాల ఫలితంగా నేడు అభివృద్ధికి అవకాశాలు అనంతంగా వున్నాయి. వాటినిఅందిపుచ్చుకోగలిగిన నేర్పును సంతరించుకుంటే, తమ నైపుణ్యాలకు, వివేకానికి మెరుగులు దిద్దుకోగలిగితే అసాధ్యమే లేదు. ఏపిమాస్ అయినా, యితర ఏ ప్రోత్సాహక సంస్థలైనా నడవవలసిన దారిని చూపించగలుగుతాయి, నడిచేదారిలో ఎదురయ్యే అవరోధాలను, ఆటంకాలను గురించి, అందుబాటులో వుండే అవకాశాల గురించి అవగాహన కలిగిస్తాయి. కాని చివరికంటా ఆ దారిలో నడవవలసింది సంస్థ నాయకులే, సభ్యులే! ఆ దారిని పూలబాటగా మార్చుకున్నా, ముళ్ళబాటగా చెడగొట్టుకున్నా ఫలితం అనుభవించవలసింది వారే. తన పవిత్ర కర్తవ్యంలో భాగంగానే ఏపిమాస్ ఈ ముఖాముఖి సమ్మేళనాన్ని ఏర్పాటు చేస్తున్నది. ఈ సదవకాశాన్ని విజయవంతం చేయడం, ఫలప్రదంగా ఉపయోగించుకోవడం ఎఫ్ పి ఓల బాధ్యత.



Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**

ఓర్పు ఎంత కష్టమనిపిస్తుందో, దాని వల్ల కలిగే ప్రతిఫలం అంత ఆనందంగా వుంటుంది

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....


- ఒకే వేదికపైకి రాయలసీమ ఎఫ్ పి ఓలు ...05
- ఎఫ్‌పిఓలు ..16 వేల కుటుంబాలకు తోడ్పాటు! ...06
- హైదరాబాదులో పోషకాహార ప్రచారాలు ...08
- చిరుధాన్యాలే ఉపాధి మార్గంగా ... ! ...10
- తెలుగు నేలలో 'పద్మ' వికాసం ! ...12
- ఆధ్యాత్మిక, ధ్యాన గురువులకు పద్మభూషణం ! ...13
- తుపాను, తెగుళ్ళతో కునారిల్లిన కంది పంట! ...17
- వరి సాగు వద్దంటున్న ' అన్నపూర్ణ ' ! ...18
- పత్తి ధర తగ్గె.. దిగుబడీ తగ్గె! ...19
- లాభసాటి రొయ్యల సాగుకోసం ప్రతిపాదనలు ...20
- మీ కాలేయాన్ని గురించి కాస్త పట్టించుకోండి ! ...21
- పన్ను ప్రయోజనాలందించే 5 పోస్టాఫీస్ పథకాలు ...23
- హెల్త్ ఇన్స్యూరెన్స్ తీసుకునే ముందు .... ...24
- అమెరికాలో గవర్నర్‌గా తెలుగు మహిళ ...25
- 'వరలక్ష్మి' పత్తి సృష్టికర్త పాపారావు మృతి ...26
- మామిడిలో పూత, పిందె దశలో సస్యరక్షణ ...27
- ఎగుమతుల స్థాయికి ఎదుగుతున్న ఎఫ్ పి ఓ ! ...30
- ఎఫ్ పి ఓ లతో రైతుల సమగ్రాభివృద్ధి ...31
- ఆదిలాబాద్‌లో ఎఫ్‌పిఓల ఏర్పాటులో స్తబ్దత ...32
- పంట నష్టం కష్టాలు తీర్చే 'ఇ-క్రాప్' ! ...33
- ఈ సంవత్సరం చిరుధాన్యాల కార్యకలాపాలు ...34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

**'మ**హిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**


మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

వెలిగే సూర్యుణ్ణి చూసి చీకటి భయపడుతుంది, శ్రమించే వ్యక్తిని చూసి ఓటమి భయపడుతుంది

# ఒకే వేదికపైకి రాయలసీమ ఎఫ్ పి ఓలు !

## ఏపిమాస్, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి4న అనంతపురంలో మహాసమ్మేళనం

రైతుల కడగండ్లను తీర్చి, కష్టాలనుంచి గట్టెక్కించి, నష్టాలను నివారించి, లాభాలబాట పట్టించి, ఆదాయాన్ని పెంచి, 'రైతే రాజు' అనే అర్ధరహితంగా మారిన నానుడిని తిరిగి అర్ధవంతంచేయడానికి ఆవిర్భవించిన విశిష్ట వ్యవస్థ రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్ పి ఓలు)! స్వయంసహాయ సమాఖ్యల మాదిరిగానే ఈ వ్యవస్థ గొప్పతనం స్వయంశక్తితో అభివృద్ధిచెందడంలో వుంది. రైతు సంక్షేమాన్ని కాంక్షిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎఫ్ పి ఓల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలను చేపడుతున్నాయి.

మన తెలుగు రాష్ట్రాలలో ఏపిమాస్ వంటి ప్రోత్సాహక సంస్థల మార్గదర్శకత్వంలో ఎఫ్ పి ఓలు ముందడుగు వేస్తున్నాయి. అయినా అభివృద్ధికి ఆకాశమే హద్దు కదా! అందుకే తన మార్గదర్శకత్వంలోని ఎఫ్ పి ఓల సమగ్రాభివృద్ధికోసం ఏపిమాస్ ఎప్పటికప్పుడు సరికొత్త మార్గాలను అన్వేషిస్తూ వస్తున్నది. అందులో భాగంగా రాయలసీమలోని ఎఫ్ పి ఓల నన్నిటిని ఒకే వేదికమీదకు తీసుకువచ్చి, సాధించిన ఫలితాలను, సమస్యలను ఉమ్మడిగా చర్చించి, మరింత అభివృద్ధికి బాటలువేయాలని సంకల్పించింది. చాలాకాలంగా ఆలోచనల స్థాయిలోనే వుంటూ వచ్చిన ఆ సంకల్పం యిప్పుడు కార్యరూపం దాలుస్తున్నది. ఏ ఎఫ్ ఎకాలజీ సెంటర్ భాగస్వామ్యంలో రాయలసీమ ఎఫ్ పి ఓల మహా సమ్మేళనాన్ని నిర్వహించడానికి రంగం సర్వం సిద్ధమైంది. 2023 ఫిబ్రవరి 4 వ తేదీన అనంతపురం పట్టణంలోని ఆర్ డి టి ఇన్క్లూజివ్ హైస్కూలు ఆవరణలో రాయలసీమ ఎఫ్ పి ఓల మహా సమ్మేళనం జరగనుంది. రాయలసీమలో నిర్వహణపరంగా ఉత్తమమైన 120 ఎఫ్ పి ఓలకు చెందిన 200 మందికి పైగా చిన్న, సన్నకారు రైతులు, ప్రభుత్వ శాఖలకు చెందిన దాదాపు 50 మంది ప్రతినిధులు, వ్యవసాయ మార్కెటింగ్ నిపుణులు, ఎఫ్ పి ఓల ప్రోత్సాహక సంస్థలుగా వున్న ఎన్ జి ఓల, ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు ఈ సమ్మేళనంలో పాల్గొననున్నారు.

**ముఖ్య అతిథి మంత్రి గోవర్ధనరెడ్డి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయం, మార్కెటింగ్, సహకారం,ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి శ్రీ కాకాణి గోవర్ధన రెడ్డి ఈ సమ్మేళనంలో ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. అదే శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ చిరంజీవి చౌదరి ప్రారంభ సభకు అధ్యక్షత వహిస్తారు. వ్యవసాయ, ఉద్యాన, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ శాఖల కమిషనర్లు, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటి సి ఇ ఓ ఈ సమ్మేళనంలో పాల్గొంటారు.

**సమ్మేళనం ప్రధాన ఆశయాలు**

ఈ క్రింది ఆశయాల సాధనకోసం ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు ...

- ఎఫ్ పి ఓల ప్రతినిధులు తమ సంస్థలు సాధించిన విజయాలను, ఎదుర్కొంటున్న సమస్యలను, నేర్చుకున్న పాఠాలను ముఖాముఖి చర్చించి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంనుంచి అవసరమైన తోడ్పాటును కోరడం.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న వివిధ పథకాలను ఉపయోగించుకోవడానికి అవసరమైన ప్రాథమిక వనరులను సమకూర్చుకుని, ఉమ్మడిగా తమ వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ చేపట్టగలిగే మార్గాలను అన్వేషించడం
- 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన దృష్ట్యా, ఎఫ్ పి ఓలు చిరుధాన్యాల సంవత్సరాన్ని జరుపుకోవలసిన తీరుతెన్నుల గురించి , కొనుగోలుదారుల-అమ్మకందారుల సమావేశాలను నిర్వహించడాన్ని గురించి చర్చించడం
- రాయలసీమలోని ఎఫ్ పి ఓలు సమర్థమైన వ్యాపార సంస్థలుగా ఎదిగి, సభ్యరైతుల వ్యవసాయ ఉత్పత్తుల విలువ పెంపు కార్యక్రమాలను చేపట్టే విషయమై నిర్దిష్ట వ్యూహాలను, కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడం ■

పిరికితనం మనిషిని శక్తిహీనుణ్ణి చేస్తుంది, ఆత్మవిశ్వాసం శక్తికి ఉత్సాహాన్ని జోడించి విజయపథం వైపు నడిపిస్తుంది

# 29 ఎఫ్ పి ఓలు ...16 వేల కుటుంబాలకు తోడ్పాటు!

## ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏపిమాస్ ఆధ్వర్యంలో రైతుల ప్రగతి పథం

– ఎస్. ప్రహల్లాద



**భా**రతదేశంలో గ్రామీణాభివృద్ధిలో స్వయం సహాయ మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయనడంలో అతియోశక్తి లేదు. ముఖ్యంగా పేద , మధ్య తరగతి కుటుంబాలకు కావలసిన రుణాలు పొందడంలో మహిళా సంఘాలు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి.

అదే తరహాలో పేద, మధ్యతరగతి రైతు కుటుంబాలకు వ్యవసాయానికి కావలసిన ఉత్పాదకాలను వారికి కావలసిన సమయంలో వారే సమకూర్చుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించడంతో పాటు, అధిక ఆదాయాలు పొందాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పది వేల రైతు ఉత్పత్తిదారు సంస్థలను (ఎఫ్ పి ఓ లను) ఏర్పాటు చేయాలని సంకల్పించింది.

**నిర్వహణ వ్యయాలు ప్రభుత్వమే సమకూరుస్తుంది**

ఈ రైతు ఉత్పత్తిదారు సంస్థల నిర్వహణ వ్యయాలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే మూడు సంవత్సరములు సమకూరుస్తుంది. ఇందులో ఇద్దరు సిబ్బందికి జీతం, కార్యాలయం అద్దె, సమావేశాల ఖర్చులు, కార్యాలయానికి కావలసిన మౌలిక సదుపాయాలు (కంప్యూటరు. కుర్చీలు, టేబుళ్ళు, ఇతర సామగ్రి) సమకూరుస్తుంది.

**కేంద్ర ప్రభుత్వ సహాయం**

| | |
|---|---|
| నిర్వహణ వ్యయాలు మూడు సంవత్సరాలకు | రూ. 18 లక్షలు |
| ఈక్విటి గ్రాంటు సభ్యుల వాటా ధనాన్నిబట్టి (గరిష్టంగా) | రూ. 15 లక్షలు |

పైన తెలిపిన నిధులే గాక కేంద్ర ప్రభుత్వం నుండి వ్యవసాయ అవస్థాపన నిధులు (ఏఐఎఫ్), పిఎంఎఫ్ఎంఇ, ఎస్ఎఫ్ఏసి నుండి సబ్సిడీ నిధులను పొందవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం నుండి కూరగాయల సేకరణ కేంద్రం, రైతు సేవా కేంద్రం ఏర్పాటు కోసం 75% సబ్సిడీతో నిధులను పొందవచ్చు . వీటితో పాటు రైతు ఉత్పత్తిదారు సంస్థ వ్యాపార లావాదేవీలకు కావలసిన పెట్టుబడి కోసం ఎన్ ఎ బి కె ఐ ఎస్ ఎ ఎన్ నుండి తక్కువ వడ్డీతో నిధులను పొందవచ్చు. అదనంగా సమున్నతి మొదలగు కంపెనీల నుండి రుణాలు పొందుటకు అవకాశం వుంది.

పొదుపు అప్పులు వివిధరకాల అభివృద్ధి కార్యక్రమాలతో భారతదేశంలో చరిత్ర సృష్టించాయి. 1970 సంవత్సరంలో మనదేశంలో ప్రారంభమైన స్వయం సహాయ మహిళా సంఘాలు 1982లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "డ్వాక్రా" పథకంతో ఊపందుకున్నాయి. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వాలు మరోవైపు కేంద్ర ప్రభుత్వ సంస్థలు వివిధ రకాల పథకాలతో మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నందువల్ల ఆర్థికాభి వృద్ధిలో మహిళా సంఘాలు నిర్మాణాత్మక పాత్ర పోషిస్తున్నాయి.

ఈ 10 వేల రైతు ఉత్పత్తిదారు సంఘాలను ప్రోత్సహించి

మార్గదర్శకత్వం వహించడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలైన నాబార్డ్, ఎస్ ఎ ఫ్ ఎ సి, ఎన్ సి డి సి, ఎన్ ఎ ఎఫ్ ఇ డి అనే నాలుగు సంస్థలను ఎంపిక చేసింది. ఈ నాలుగు సంస్థలు రాష్ట్రాలలో రైతు ఉత్పత్తిదారు సంస్థలను ప్రోత్సహించ డానికి తిరిగి ప్రతి రాష్ట్రంలో కొన్ని 'క్లసర్ స్థాయి వ్యాపార సంస్థలు' (సి బి బి ఓలు) గా ఏపిమాస్ లాంటి కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలను ఎంపిక చేశాయి. ఈ స్వచ్ఛంద సంస్థలు దేశంలో చిన్న,సన్నకారు రైతులు సభ్యులుగా 'రైతు ఉత్పత్తిదారు సంస్థల ఏర్పాటు చేస్తున్నాయి.



**రైతు అభివృద్ధిలో భాగస్వామిగా ఏపిమాస్**

మహిళలు, రైతుల అభివృద్ధిలో భాగస్వామిగా ఏపిమాస్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహారు రాష్ట్రాలలో ప్రత్యక్షంగాను మరికొన్ని రాష్ట్రాలలో ఇతర భాగస్వామ్య సంస్థల సహకారంతో 20 వసంతాలు విజయవంతంగా పూర్తి చేసుకొన్నది. 2030 నాటికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ రెండున్నర లక్షల



అట్టడుగు వర్గాల (ఎస్సీ, ఎస్టీ, చిన్న కమతాల రైతులు, యువత, (గ్రామీణ, పట్టణ పేదలు) కుటుంబాలతో స్వావలంబన కలిగిన సంస్థలను నిర్మించి వారికి వివిధ రకాల సేవలను అందించాలనే సంకల్పంతో వివిధ రకాల ప్రణాళికలను రూపొందిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు, అనంతపురం జిల్లాలలో అంచెలంచెలుగా తన కార్యక్రమాల, సేవల పరిధిని విస్తరించుకుంటూ ఏపిమాస్ విజయవంతంగా ముందుకు సాగుచున్నది.

ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని 26 మండలాలలో (రామసముద్రం, మదనపల్లి, నిమ్మనపల్లి, పలమనేరు, వి.కోట, కురబలకోట, వాల్మికిపురం, కలికిరి, పీలేరు, కలకడ, బి.కోత్తకోట, పెద్దమండ్యం, తంబళ్లపల్లి, సోమల, సదుం, పెద్దతిప్ప సముద్రం, పుంగనూరు, బైరెడ్డిపల్లి, విజయపురం, నాగలాపురం, రామ చంద్రాపురం, గుడిపాల, తవణంపల్లి, చౌడేపల్లి, గుర్రంకొండ, పెండ్లిమర్రి) 29 రైతు ఉత్పత్తిదారు సంస్థలను ఏర్పాటు చేసి తద్వారా దాదాపు 16,000 కుటుంబాలను సభ్యులుగా చేర్చుకొని వివిధ రకాల కార్యక్రమాలను అమలు చేస్తున్నారు.

**సంస్థల సుస్థిరతకు ఏపిమాస్ తోడ్పాటు**

రైతు ఉత్పత్తిదారు సంస్థలు తనంతట తానుగా నిలదొక్కుకుని స్వావలంబన దిశగా ముందుకు సాగడానికి ఏపిమాస్ అనేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకొని ఈ ఎప్ పి ఓలు ఎవరిపైనా ఆధారపడకుండా స్వంతంగా ప్రగతి సాధించే విధంగా మార్గదర్శకత్వం వహిస్తున్నది.

■

నచ్చిన పనిని మూర్ఖుడైనా గొప్పగా చేయగలడు, కాని ప్రతి పనినీ నచ్చే రీతిలో మలుచుకోవడమే వివేకి లక్షణం

# హైదరాబాదు స్లమ్స్‌లో మహిళలకు పోషకాహార ప్రచారాలు

– భవాని, ప్రాజెక్ట్ మేనేజర్, రాణి కాంతల, ప్రగతి (మెంటర్)

హైదరాబాదు నగరంలో, జిహెచ్ఎంసి పరిధిలో, మెహిదీపట్నం ,కార్వాన్ సర్కిళ్లలో ఏపిమాస్ – విప్రో, కేర్స్, సహకారంతో గర్భిణిలు, బాలింతలు, 2 సంవత్సరాలలోపు పిల్లలు, కిశోరబాలికలు తగిన పోషకాహారాన్ని తీసుకుని, తమ ఆరోగ్యాన్ని, శరీర పటుత్వాన్ని మెరుగుపరచుకోవడం లక్ష్యంగా పట్టణ స్థాయి సంఘాలను, సమాఖ్యలను ఈ కార్యక్రమం అమలులో కీలక సూత్రధారులను చేస్తూ, 'పట్టణ –పోషణ' (అర్బన్ న్యూట్రిషన్ ప్రాజెక్ట్ ) పథకాన్ని ఏపిమాస్ అమలు చేస్తున్నది.





స్వయం సహాయ సంఘాలతో ,ఆరోగ్య కార్యకర్తలతో కలిసి పనిచేస్తూ అంగన్వాడిలు, ఆరోగ్య కేంద్రాలు అందించే సేవలను వినియోగించుకోవడం ద్వారా, లక్ష్యంగా చేసుకున్న జనాభా, అంటే కిశోర బాలికలు (15–19 సంవత్సరాలు), గర్భిణీలు, పాలిచ్చే స్త్రీల పోషకాహారం, ఆరోగ్యం తీరుతెన్నులలో సానుకూల మార్పు తీసుకురావడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం.

ముందుగా ఎంపిక చేయబడ్డ స్లమ్స్, మెహదీపట్నం సర్కిల్‌లోని వివేకానందనగర్, భోజగుట్ట, శివాజీనగర్, శ్రీరామనగర్, హీరానగర్, కార్వాన్ సర్కిల్‌లోని కాళికాబర్, యూసుఫ్ కాలనీ, మెహబూబ్ కాలనీ, ఏఎస్ఆర్ నగర్, సాయినగర్‌లో ఇంటింటి సర్వే చేసి, ప్రాజెక్ట్ అమలు పరచటానికి ముందు పరిస్థితులు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకోవటానికి బేస్‌లైన్ సర్వే నిర్వహించాము. అనంతరం ప్రవేశ స్థాయి ప్రచార కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. లక్షిత లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంలో, ఆరోగ్య శాఖ, ఐసిడిఎస్ మద్దతుతో ప్రాజెక్ట్ కార్యక్రమాలను పరిచయం చేయడానికి వివిధ ఎజెండాలతో జనవరి 10 నుండి జనవరి 24 వరకు 7 రోజులపాటు ఈ కార్యక్రమాలను నిర్వహించాము.

**1వ రోజు :** జనవరి 10న భోజగుట్టలో గర్భిణీలు, బాలింతలు, స్వయంసహాయ సంఘాల మహిళలతో స్లమ్స్‌లో సమావేశం నిర్వహించగా, 30మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు. ప్రాజెక్ట్ బృందం ముందుగా వారికి ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశాన్ని తెలియపరచి, వారు ఐసిడిఎస్ సేవలకోసం నమోదు చేసుకున్నారా, వాటిని అందుకున్నారా అని తెలుసుకోవడం, అనంతరం అందుబాటులో ఉన్న స్వయం సహాయ సంఘాలను బలోపేతం చేయడం, కొత్త స్వయం సహాయ సంఘాల ఏర్పాటు, స్లమ్ స్థాయి ప్రచారాలనిర్వహణపై చర్చ సాగింది.

**2వ రోజు:** జనవరి 11న, శివాజీనగర్ స్లమ్‌లో కిశోర బాలికలు, స్వయం సహాయ సంఘాల మహిళలకు ప్రాజెక్ట్ లక్ష్యాలను తెలియజేసి, బాలికలకు పౌష్టికాహారం, బహిష్టు పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు క్విజ్ పోటీలను నిర్వహించాము. ఆహార వైవిధ్యం ప్రాముఖ్యత గురించి వారికి అర్థమయ్యేలా 10 ఆహార సమూహాలతో కూడిన రంగుల ముగ్గులతో వివరించడం జరిగింది. స్వయం సహాయ సంఘాలకు చెందిన మహిళలకు ప్రాజెక్ట్ కార్యక్రమాలపై కరపత్రాలను అందించాము. ఈ సమావేశానికి మొత్తం 30 మంది సభ్యులు హాజరయ్యారు.

**3వ రోజు :** జనవరి 12న జరిగిన కార్యక్రమంలో ఏఎస్ఆర్ నగర్, సాయినగర్ స్లమ్స్‌కి చెందిన గర్భిణీలు, బాలింతలు మొత్తం 40 మంది మహిళలు ఉత్సాహంగా తరలి వచ్చారు. వారి స్లమ్స్‌లో అమలు చేయాల్సిన ప్రాజెక్టుపై వారికి

అవగాహన కల్పించడం జరిగింది. 2 నెలల శిశువుతో పాటు, ఎక్కువ మంది పాలిచ్చే తల్లులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

'అర్బన్ న్యూట్రిషన్ ప్రాజెక్ట్' బృందం నుండి విషయాలు తెలుసుకోవడానికి వీరు ఎంతో ఉత్సుకతను చూపించారు. ఇక్కడ పాల్గొన్న చాలామంది గర్భిణీలు, పాలిచ్చే తల్లులు కొత్త కోడళ్ళు ప్రస్తుతం వున్న స్వయం సహాయ సంఘాల కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనడం లేదు కానీ, వారి ప్రాంతంలో కొత్త స్వయం సహాయ సంఘాలను ఏర్పాటు చేసుకోడానికి సిద్ధంగా ఉన్నారు.

**4వ రోజు:** 4వ రోజున సంక్రాంతి పండుగకు ముందు జనవరి 13వ తేదీన వివేకానందనగర్ స్లమ్‌లోని మహిళలు, కిశోర బాలికలకు ప్రోత్సాహకరంగా ముగ్గుల పోటీలు నిర్వహించాము. 15 మంది కిశోర బాలికలు, మహిళలు పోటీలో పాల్గొని తమ రంగవల్లుల పోటీకి వన్నె తెచ్చారు.



వీరికి బహుమతులను ప్రదానం చేయడం జరిగింది.

**5వ రోజు:** జనవరి 17న కాళికాభేర్ స్లమ్‌లో ప్రవేశ స్థాయి ప్రచారం నిర్వహించాము. ఈ కార్యక్రమంలో మహిళలు చురుగ్గా పాల్గొని ప్రాజెక్టు కార్యక్రమాలను విని, అర్థం చేసుకున్నారు. చురుగ్గా పని చేయని స్వయం సహాయ సంఘాలను క్రియాశీలంగా చేసి, బలోపేతం చేయడం గురించి, కొత్త సంఘాలను ఏర్పాటు చేయడానికి తీసుకోవలసిన తక్షణ చర్యల గురించి చర్చసాగింది.

**6వ రోజు:** జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా, ఏపిమాస్-అర్బన్ న్యూట్రిషన్ ప్రాజెక్ట్ బృందం జనవరి 24న



100 మందికి పైగా కిశోర బాలికలను ఒక చోట చేర్చి కుల్సుంపురా బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఋతు పరిశుభ్రత, పోషకాహారం, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, బాలికల హక్కులు, ఇతర సాధారణ అంశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. ఈ కార్య క్రమంలో ఏపిమాస్ బృందంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, కమిట్‌మెంట్స్ సిబ్బంది, టి బి అలర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

**7వ రోజు:** సాముహిక కార్యక్రమాలలో మొదటగా 6 నెలలు నిండి, 7వ నెలలో ఉన్న పిల్లలకు తల్లి పాలతో పాటు అదనపు ఆహారాన్ని అందించడం మొదలుపెట్టాలనే ఉద్దేశంతో రెండు స్లమ్‌లు, శివాజీనగర్, శ్రీరాంనగర్ స్లమ్స్‌లో సామూహిక అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించాము. మొత్తం 35 మంది బాలింతలతో పాటు, వారి పిల్లలు, కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. బిడ్డకు ఆహారం ఇచ్చే ముందు తల్లి చేతులు కడుక్కోవడం, తదితర పరిశుభ్రత పద్ధతుల గురించి వివరించడం జరిగింది.

అన్నప్రాశనలో భాగంగా, 6 నెలల తర్వాత ఇచ్చే ప్రాథమిక పరిపూరకరమైన ఆహారంగా తెలంగాణ ప్రభుత్వం అందించే బాలామృతాన్ని పిల్లలకు తినిపించాము. ఈ బాలామృతం చాలా పోషక విలువలతో కూడినదే కాక, శిశువులకు ఎంతో ఆరోగ్యకరమైనది కూడా. పిల్లల అనుబంధ పోషకాహారాన్ని ఎలా తయారుచేయాలో, పిల్లలకు తినిపించేటప్పుడు ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తల్లులకు ప్రదర్శన రూపంలో అవగాహన కలిగించడం జరిగింది. ■

# చిరుధాన్యాల తినుబండారాలే ఉపాధి మార్గంగా ... !

– బి.నవ్య , డా.టి.వినోద్‌కుమార్, డాక్టర్ ఎ. శ్రీనివాస్

పెద్దపల్లిజిల్లా, మంతిని మండలం, నాగారం గ్రామంలో చిన్న , సన్నకారు రైతు కుటుంబాలవారు తక్కువ ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు. పెరిగిన ఖర్చుల కారణంగా, తక్కువ ఆదాయంతో ఇల్లు నడపడం గృహిణులకు ఇబ్బందిగా మారింది. ఈ సమస్యనుంచి బయటపడడం కోసం ఆ గ్రామ మహిళలు తమ కుటుంబ ఆదాయాన్ని పెంచుకునే మార్గాల గురించి, స్వయం ఉపాధి కార్యక్రమాల గురించి ఆలోచించసాగారు.

**కృషి విజ్ఞానకేంద్రం తోడ్పాటు**

ఈ దశలో జిల్లాలోని రామగిరి ఖిల్లా 'కృషి విజ్ఞాన కేంద్రం' వారు గ్రామంలో మహిళల ఉపాధిని పెంపొందించడానికి అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలోని మహిళా రైతులను ప్రోత్సహిస్తూ వారికి చిరు ధాన్యాలతో బిస్కెట్ల తయారీ, యితర చిరుధాన్యాల స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కలిగించడమే కాకుండా, ఆ గ్రామ మహిళలతో 'సిరిఫుడ్స్' (సంగమేశ్వర మహిళా సంఘం) పేరుతో 2020 సంవత్సరంలో ఒక క్లస్టర్ ఇంట్రెస్ట్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సమూహంలో మొత్తం 14 మంది మహిళలు సభ్యులైనారు.

| సిరిఫుడ్స్ వారి వివిధ ఉత్పత్తులు | | | |
|---|---|---|---|
| **తయారుచేస్తున్న ఉత్పత్తులు** | **ధర రూ** | | |
| రాగి బిస్కెట్ | 65/- | | 250 గ్రా. |
| మల్టీ గ్రెయిన్ బిస్కెట్స్ | 70/- | 〃 | 250 గ్రా. |
| జొన్న సాల్ట్ బిస్కెట్స్ | 65/- | 〃 | 250 గ్రా. |
| జొన్న ప్లెయిన్ బిస్కెట్ | 65/- | 〃 | 250 గ్రా. |
| రాగిలడ్డు | 10/- | 〃 | లడ్డు |
| అవిసె లడ్డు | 20/- | 〃 | లడ్డు |
| జొన్న కేక్ | 400/- | 〃 | కేజీ |
| రాగి కేక్ | 400/- | 〃 | కేజీ |
| దిల్ పసంద్ | 60/- | 〃 | పీస్ |
| సమోసా | 15/- | 〃 | పీస్ |
| ఎగ్ పఫ్ | 20/- | 〃 | పీస్ |
| కర్రీ పఫ్ | 15/- | 〃 | పీస్ |
| రాగిజావా | 10/- | 〃 | గ్లాస్ |



**చిరుధాన్యాల బిస్కెట్ యూనిట్ ఏర్పాటు**

ఈ గ్రూపు సభ్యులకు 15 రోజులపాటు చిరుధాన్యాలతో బిస్కెట్లు తయారీపైన శిక్షణ యిచ్చారు. రాజమండ్రి నుంచి నిపుణులను పిలిపించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ పొందిన మహిళలకు బిస్కెట్ యూనిట్‌ను ప్రారంభించే విధంగా తోడ్పాటు అందించారు.

బిస్కెట్ తయారీకి అవసరమైన వివిధ యంత్ర పరికరాలను కృషి విజ్ఞాన కేంద్రం వారు సమకూర్చారు. బిస్కెట్ తయారీ యూనిట్ క్రింద ఒక మైక్రో ఓవెన్, ఐదు కేజీల గ్రైండర్ మిక్సర్, ఒక పల్వరైజర్ని అందజేశారు. పెద్దపల్లి డి ఆర్ డి ఓ వారు మౌలిక సదుపాయాల అభివృద్ధి కింద బిస్కెట్ యూనిట్‌కు రూ. 80,000 అందించారు.

**బిస్కెట్ యూనిట్ విస్తరణ**

బిస్కెట్ యూనిట్ ప్రారంభంలో మహిళలు రాగిబిస్కెట్, మల్టీగ్రెయిన్ బిస్కెట్, జొన్న బిస్కెట్ మాత్రమే తయారు చేశారు. కేవలం ఈ రకమైన పరిమిత ఉత్పత్తులతో సరిపడా ఆదాయం

జీవితం పోరాటాల, భ్రమల పరంపర ; జీవిత పరమార్థం సుఖపడడంకాదు, అనుభవాలద్వారా నేర్చుకోవడం

రాకపోవడంతో, వారు యూనిట్‌ను విస్తరించాలని సంకల్పించి, గ్రూప్ సభ్యులు తలా కొంత నగదు పోగు చేసుకుని, బిస్కెట్ యూనిట్ విస్తరణ కోసం పెట్టుబడి పెట్టారు. పెట్టుబడి పెంచడంతో పాటు, వారు మరికొన్ని పదార్థాల తయారీపై శిక్షణపొంది, కొత్త ఉత్పత్తులను జోడించసాగారు. ఈ శిక్షణ సమయంలోనే వారు బిస్కెట్ల తయారీకి అవసరమయ్యే ముడిసరుకులను బయటనుండి కొనుగోలు చేయడం వల్ల ఆదాయం తక్కువగా వస్తుండడాన్ని గుర్తించారు. ఇందుకు విరుగుడుగా ఆ మహిళలు వారి గ్రామంలోని పొలాలలో చిరుధాన్యాలను పండించి, వాటిని ముడి సరుకులుగా వాడడం ప్రారంభించారు. దీనివల్ల వారికి ఖర్చు తగ్గి, ఆదాయం పెరిగింది.

**రకరకాల ఉత్పత్తులు**

ప్రస్తుతం వీరు రాగి బిస్కెట్స్, మల్టీగ్రెయిన్ బిస్కెట్స్, జొన్నసాల్ట్ బిస్కెట్స్, జొన్న ప్లెయిన్ బిస్కెట్స్, రాగిలడ్డు, అవిసె లడ్డు, జొన్న కేక్, రాగి కేక్, దిల్‌పసంద్, సమోసా, ఎగ్‌పఫ్, కర్రీ పఫ్, రాగి జావ మొదలైన వివిధ రకాల చిరు ధాన్యాల ఉత్పత్తులను తయారుచేస్తూ, తమ సంస్థ ఉత్పత్తుల పరిమాణాన్ని రోజుకు 500 కేజీల స్థాయికి పెంచుకున్నారు. ఈ యూనిట్ వారు తయారుచేసే బిస్కెట్స్‌కు ఎఫ్ ఎస్ ఎస్ ఎ ఐ లైసెన్స్ కూడా లభించడం మరో విశేషం.



వీరు బిస్కెట్ల తయారీలో మంచి నాణ్యతను, శుభ్రతను పాటిస్తూ, మంచి ప్యాకింగ్, లేబిలింగ్ చేస్తూ వినియోగ దారులను ఆకర్షిస్తున్నారు. వీరు తయారుచేసే బిస్కెట్స్‌కు మార్కెట్లో మంచి డిమాండ్ ఏర్పడింది. 'సిరిఫుడ్స్' బిస్కెట్లను ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలతోపాటు మహారాష్ట్రలోని అనేక పెద్ద పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. ఇంతేకాకుండా ఈ 'సిరిఫుడ్స్' ఉత్పత్తులకు సుప్రసిద్ధ ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థల ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో చోటు లభించడంతో వీరు తమ ఉత్పత్తులకు మార్కెట్‌ను మరింత విస్తరించుకోగలిగారు. రోజుకు దాదాపు 500 కేజీలకు పైగా బిస్కెట్లను మార్కెటింగ్ చేస్తూ వారి ఆదాయం పెంచుకుంటూ, ఆత్మవిశ్వాసంతో ముందడుగులు వేస్తున్నారు.

(వ్యాస రచయితలు పెద్దపల్లిజిల్లా, రామగిరిఖిల్లా 'కృషి విజ్ఞాన కేంద్రం' శాస్త్రవేత్తలు)

■

## సమతుల అభివృద్ధితోనే రాష్ట్ర ప్రగతి

**మూ**డు ప్రాంతాల సమతుల అభివృద్ధితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని యాక్షన్ ఫ్రటెర్నా ఎకాలజీ సెంటర్ (ఏఎఫ్ఎస్ఈసీ) డైరెక్టర్ డాక్టర్ వై.వి.మల్లారెడ్డి చెప్పారు. ఆయన ఏపిమాస్ సిఇఓ శ్రీ సిఎస్ రెడ్డితో కలసి, వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శ్రీ కె.ఎస్.జవహర్ రెడ్డిని కలిశారు. విభజన చట్టం సెక్షన్-94(2)లో రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని సీఎస్‌కు గుర్తు చేశారు. వ్యవసాయం,నీటిపారుదల, పారిశ్రామిక రంగాల్లో అత్యంత వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించడానికి నిపుణులతో సమతుల అభివృద్ధి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ కమిషన్ రూపొందించిన ప్రణాళికను కేంద్రానికి పంపి బుందేల్‌ఖండ్ ప్రాంతం అభివృద్ధికి అమలు చేస్తున్న ప్యాకేజీని ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు సాధించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సిరి ధాన్యాల సాగుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రశంసించారు.

ఈ ఏడాదిని అంతర్జాతీయ సిరి ధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందన్నారు. సిరిధాన్యాలకు మద్దతు ధర ప్రకటించడం ద్వారా రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో సిరిధాన్యాల సాగు పెంచేలా రైతులను ప్రోత్సహించాలని కోరారు. ఇదే రీతిలో పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ■

# తెలుగు నేలలో 'పద్మ' వికాసం !

రిపబ్లిక్‌డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను ప్రకటించింది. పలు రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులను అత్యున్నత పురస్కారాలకు ఎంపిక చేసింది. 106 పద్మ పురస్కారాలకు ఈ ఏడాది 109 మందిని ఎంపిక చేసింది.

ఆరుగురిని పద్మవిభూషణ్, తొమ్మిది మందిని పద్మభూషణ్ పురస్కారాలు వరించాయి. 91 పద్మశ్రీ పురస్కారాలకు 94 మంది (మూడు కేటగిరీల్లో ఇద్దరేసి) ఎంపికయ్యారు. పద్మ పురస్కారాలకు ఎంపికైనవారి పేర్ల జాబితాను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ విడుదలచేసింది. తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 12 మంది (పదో వంతుకు పైగా) ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు.

తెలంగాణ నుంచి ఆధ్యాత్మిక విభాగంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు చినజీయర్ స్వామి, కమలేశ్.డి. పటేల్ పద్మభూషణ్ పురస్కారానికి ఎంపికయ్యారు. గుజరాత్‌కు చెందిన కమలేశ్.. హైదరాబాద్‌లో రామచంద్ర మిషన్‌ను నిర్వహిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి (ఆంధ్రప్రదేశ్)ని పద్మశ్రీ వరించింది.

తెలంగాణ నుంచి ప్రముఖ శాస్త్రవేత్త మోదడుగు విజయ్ గుప్తా, ప్రముఖ వైద్యుడు పసుపులేటి హన్మంతరావు, ప్రముఖ భాషావేత్త బి.రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రముఖ సాంకేతిక ఇంజనీర్లు గణేశ్ నాగప్ప కృష్ణరాజనగర, అబ్బారెడ్డి నాగేశ్వరరావు, ఏటికొప్పాకకు చెందిన కొయ్యబొమ్మల కళాకారుడు సీవీ రాజు, గుంటూరుకు చెందిన ప్రముఖ హరికథా విద్వాంసుడు కోట సచ్చిదానంద శాస్త్రి, ప్రముఖ సామాజికవేత్త సంకురాత్రి చంద్రశేఖర్, విద్యావేత్త ప్రకాశ్ చంద్రసూద్ పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికయ్యారు.

వీరిలో నాగప్ప గణేశ్ ప్రముఖ జీవశాస్త్రవేత్త. ఆయన తిరుపతిలోని ఐఐఎసఈఆర్‌కు వ్యవస్థాపక డైరెక్టర్. అబ్బారెడ్డి నాగేశ్వరరావు అసోంలో నివసిస్తున్న తెలుగు శాస్త్రవేత్త. ఆయన 33 రకాల పూల మొక్కలను కనిపెట్టారు. సంకురాత్రి చంద్రశేఖర్ సమాజసేవలో నిమగ్నమయ్యారు. ఇక ప్రకాశ్ చంద్రసూద్ అణుభౌతిక శాస్త్రవేత్త. డాక్టర్ పసుపులేటి హన్మంతరావు సికింద్రాబాద్‌లో పిల్లల డాక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. జీవ శాస్త్రవేత్త విజయ్‌గుప్తా బాపట్లకు చెందినవారు. ప్రొఫెసర్ బి.రామకృష్ణారెడ్డి తెలుగు వర్సిటీలో సేవలు అందించిన బహుభాషా శాస్త్రవేత్త. గిరిజన భాషల సంరక్షణకు విశేష కృషిచేశారు.

**సుధామూర్తి, వాణీ జయరాంలకు పద్మభూషణ్**

పద్మ భూషణ్ అవార్డు లభించిన 9 మందిలో గాయని వాణీజయరాం, ప్రముఖ సాహితీవేత్త భైరప్ప, పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా, ప్రముఖ నేపథ్య గాయని సుమన్ కళ్యాణ్‌పూర్, ప్రముఖ భాషావేత్త కపిల్ కపూర్, ప్రముఖ సామాజికవేత్త సుధామూర్తి ఉన్నారు.

**ఆరుగురికి పద్మ విభూషణ్**

గత ఏడాది దివంగతుడైన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయంసింగ్ యాదవ్‌కు కేంద్రం పద్మ విభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్ఎం కృష్ణ, తబలా విద్వాంసుడు జాకిర్ హుస్సేన్, దివంగత వాస్తు శాస్త్రవేత్త బాలకృష్ణ దోషి, ప్రముఖ శిశు వైద్య నిపుణుడు, ఓఆర్ఎస్‌ను కనిపెట్టిన దివంగత వైద్యుడు దిలావ్ మహలానాబిస్, గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ వర్ధన్‌లకు పద్మ విభూషణ్ లభించింది.

పద్మశ్రీ పురస్కారాలు లభించిన యితర రాష్ట్రాల ప్రముఖులలో కేంద్ర సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు విశ్వనాథ్ ప్రసాద్ తివారీ, గణిత శాస్త్రవేత్త రాధాచరణ్ గుప్తా, రాజస్థాన్‌కు చెందిన గజల్ గాయకులు అహ్మద్ హుస్సేన్, మహ్మద్ హుస్సేన్, తదితరులున్నారు. పద్మ అవార్డులకు ఎంపికైన వారికి సీఎం కేసీఆర్, టీడీపీ అధినేత చంద్రబాబు అభినందనలు తెలిపారు. ■

చిత్తశుద్ధి, పట్టుదల, ఓర్పు కార్యసిద్ధికి ఆవశ్యకం; వీటిని మించి చేసే పనిని ప్రేమించడం మరింత ఆవశ్యకం

# ఆధ్యాత్మిక, ధ్యాన గురువులకు పద్మ భూషణం !

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు... సమతామూర్తి విగ్రహ ప్రతిష్ఠా సూత్రధారి శ్రీ చినజీయర్ స్వామికి కేంద్రం పద్మభూషణ్ అవార్డు ప్రకటించింది. వీరితోపాటు పఖ్యాత ధ్యాన గురువు, హైదరాబాదులోని శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్ ను కూడా పద్మభూషణ్ పురస్కారం వరించింది.

1956వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జన్మించిన శ్రీ త్రిదండి 1980లో సన్యాసిగా దీక్షను స్వీకరించిన అనంతరం త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామీజీ అయ్యారు. చినజీయర్ స్వామి 1981లో నడిగడ్డపాలెంలోని శ్రీమద్ ఉభయ వేదాంత ఆచార్య పీఠానికి అధిపతి అయ్యారు.

జీయర్‌స్వామి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు విద్యనందించేందుకు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, వికాస తరంగిణిలను ఏర్పాటు చేశారు. విజయవాడ కేంద్రంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం శంషాబాద్‌లో శ్రీరామనగర్‌లోని జీవాశ్రమం పేరుతో ఆశ్రమాన్ని నిర్మించారు. దివ్య సాకేతం పేరుతో ఆలయాన్ని ప్రారంభించారు. అనంతరం జిమ్స్ (జియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) పేరుతో వైద్య కళాశాల నెలకొల్పారు. అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేద సేవలందిస్తారు.

**చిరునవ్వు... ప్రేమ... శాంతి:**

చినజియర్ స్వామి చిరునవ్వు, ప్రేమ, శాంతికి చిరునామాగా పేరొందారు. జ్ఞానోదయ ఆధ్యాత్మిక, మానవతా వాదిగా ప్రసిద్ధులు. పరమత సహనం, అహింస, జీవుల పట్ల పరస్పర గౌరవం ద్వారా ప్రపంచ శాంతి మరియు సామరస్యాన్ని ప్రోత్సహించేందుకు జీయర్ స్వామి కృషి చేస్తున్నారు. ఆధ్యాత్మిక కోణంతో పాటు అందరూ సమానమేనన్న భావనను పెంపొందించేందుకు చినజీయర్ స్వామి.. శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్ వద్ద 50 ఎకరాల్లో 216 అడుగుల ఎత్తయిన సమతామూర్తి (రామనుజాచార్యులు) విగ్రహాన్ని ప్రతిష్టించారు. ప్రధాని నరేంద్రమోదీ గతేడాది. ఫిబ్రవరిలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.

**ధ్యాన గురువు దాజీ**

ప్రపంచవ్యాప్తంగా హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ గైడ్ గా, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, హార్ట్‌ఫుల్‌నెస్ ఎడ్యుకేషన్ ట్రస్ట్

## పద్మపురస్కార మహిళలు ... 2023

### పద్మభూషణ్

| | | |
|---|---|---|
| 1. శ్రీమతి వాణీ జయరామ్ | ఆర్ట్ | తమిళనాడు |
| 2. శ్రీమతి సుమన్ కల్యాన్‌పూర్ | ఆర్ట్ | మహారాష్ట్ర |
| 3. శ్రీమతి సుధామూర్తి | సోషల్ వర్క్ | కర్నాటక |

### పద్మశ్రీ

| | | |
|---|---|---|
| 1. శ్రీమతి జోధియాభాయ్ బాయిజా | ఆర్ట్ | మధ్యప్రదేశ్ |
| 2. శ్రీమతి ఉషా బార్లే | ఆర్ట్ | ఛత్తీస్‌గఢ్ |
| 3. శ్రీమతి హెమోప్రోవా చుటియా | ఆర్ట్ | అస్సాం |
| 4. శ్రీమతి సుభద్రా దేవి | ఆర్ట్ | బీహార్ |
| 5. శ్రీమతి ప్రితికన గోస్వామి | ఆర్ట్ | వెస్ట్ బెంగాల్ |
| 6. శ్రీమతి హీరాబాయ్ లాబి | సోషల్ వర్క్ | గుజరాత్ |
| 7. శ్రీమతి రాణీ మచయ్య | ఆర్ట్ | కర్నాటక |
| 8. శ్రీమతి డాక్టర్ నళిని పార్ధసారధి | మెడిసిన్ | పుదుచ్చేరి |
| 9. శ్రీమతి క్రిష్ణ పటేల్ | ఆర్ట్ | ఒడిస్సా |
| 10.శ్రీమతి సుజాత ఆర్ రాయ్–సైన్స్,ఇంజనీరింగ్ (కెనడా) | | |
| 11. శ్రీమతి కె సి రుర్నెసంఘి | ఆర్ట్ | మిజోరాం |
| 12. శ్రీమతి నైహున్యోసార్హీ | ఆర్ట్ | నాగాలాండ్ |
| 13. శ్రీమతి రవీనా రావి టాండన్ | ఆర్ట్ | మహారాష్ట్ర |
| 14. శ్రీమతి కూమినారిమన్‌వాడియా | ఆర్ట్ | మహారాష్ట్ర |

ఏదీ అల్పమైనది కాదు, కానీ టన్ను శాస్త్రజ్ఞానం కన్నా ఔన్స్ అనుభవం గొప్పది

వ్యవస్థాపకుడిగా, సహజ్ మార్గ్ స్పిరిచ్యువాలిటీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీగా ఉన్న ప్రఖ్యాత ధ్యాన గురువు, శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు కమలేష్ డి పటేల్ కు కేంద్ర ప్రభుత్వం పద్మ భూషణ్ అవార్డు ప్రకటించింది. దాజీ (పెద్దన్న) అని పిలుచుకునే కమలేష్ డి పటేల్ గుజరాత్లో 1956లో జన్మించారు. ఫార్మసీ విద్యార్థిగా ఉన్న సమయంలోనే రాజయోగ ధ్యానం మొదలెట్టారు. గురువు రామ్‌చంద్ర (బాపూజీ) దగ్గర 1976 నుంచి సాధన మొదలెట్టారు. అహ్మదాబాద్‌లో ఫార్మసీలో గ్రాడ్యుయేషన్ చేశాక న్యూయార్క్ వెళ్లారు. పీజీ పూర్తయ్యాక అక్కడే ఫార్మా వ్యాపారం ప్రారంభించారు. భార్య, ఇద్దరు పిల్లలతో కొంతకాలం అక్కడే ఉన్నారు.

1983లో రామ్‌చంద్ర మరణంతో అధ్యక్షుడిగా పార్థసారథి రాజగోపాలాచారి (చారిజీ) బాధ్యతలు చేపట్టారు. ఆయనతో కలిసి 2003 నుంచి శ్రీరామచంద్ర మిషన్ కార్యకలాపాల్లో భాగస్వామి అయ్యారు. 2014 నుంచి శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. భారత్‌తో పాటూ అమెరికాలో వేర్వేరు ప్రాంతాల్లో ఆయన ఆధ్యాత్మిక కార్యశాలలు నిర్వహించారు. ఈయన సేవలను గుర్తించి తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 2018లో గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. 2020లో ప్రియదర్శిని ఆకాడమీ రామకృష్ణ బజాజ్ స్మారక గ్లోబల్ అవార్డుతో సత్కరించింది. ఆయన రాసిన ది హార్ట్‌ఫుల్‌నెస్ వే పుస్తకానికి విశేష ఆదరణ లభించింది.

## సిరి ధాన్యాల ఖాదర్ వలీకి పద్మశ్రీ

**చి**రుధాన్యాల ఉపయోగాలు, వాటి వినియోగం గురించి తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఖాదర్ వలీని పద్మశ్రీ పురస్కారం వరించింది. ఆంధ్రప్రదేశ్ లోని వైయస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో జన్మించిన ఆయన బీఎస్సీ, ఎంఎస్సీ (ఎడ్యుకేషన్) మైసూరులోని రీజినల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్లో చదివారు. అమెరికాలోని న్యూపాంట్ కంపెనీలో పనిచేశారు. అంతరించిపోతున్న 5రకాల చిరుధాన్యాలైన కొర్రలు, అండుకొర్రలు, సామలు, అరికెలు, ఊదల పునరుద్ధరణకు కృషిచేశారు.

## హరికథల కోటకు పద్మశ్రీ పురస్కారం

**హ**రికథలను సినిమా కథలకంటే ఆసక్తిగా చెప్పగల నైపుణ్యం...కోటా సచ్చిదానంద శాస్త్రి సొంతం. ఆ కళే ఇప్పుడు ఆయనకు 'పద్మశ్రీ' తెచ్చిపెట్టింది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సచ్చిదానంద శాస్త్రి హరికథా విద్వాంసుడు ఆదిభట్ల నారాయణదాసు ప్రియ శిష్యుల్లో ఒకరు. దేశవ్యాప్తంగా 1500కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా అనేక పురస్కారాలు దక్కాయి. ఇప్పుడు ఏకంగా 'పద్మశ్రీ'యే వరించింది.

## అణు శాస్త్రవేత్త ప్రకాష్ చంద్రసూద్

**స**త్యసాయి విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పని చేస్తున్న ప్రకాష్ చంద్రసూద్ సేవలనున గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. పంజాబ్‌లో 1928లో సామాన్య కుటుంబంలో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం పంజాబ్‌లో కొనసాగించి, అమెరికాలో పీహెచ్‌డీ చేశాడు. 1969 నుంచి 1988 వరకు వారణాసి లోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పని చేశారు. 1988లోనే పదవీ విరమణ పొందారు. ముంబయ్‌లోని బాబా అణు పరిశోధన కేంద్రంలో 1998 నుంచి 1999 వరకు పని చేశారు. సత్యసాయి బాబా సూచన మేరకు 1998 నుంచి సత్యసాయి విశ్వవిద్యాలయంలో విద్యాబోధనతోపాటు పరిశోధన అధ్యాపకులుగా పని చేస్తున్నారు. ప్రత్యేకంగా న్యూక్లియర్ ఫిజిక్స్ ఎడ్యుకేషన్ రంగంలో ముందుకెళ్తున్నారు. ప్రస్తుతం ఆయనభారతదేశంలోని అత్యంత సీనియర్ అణు శాస్త్రవేత్తలలో ఒకరు. నేటికీ అధ్యాపకులుగా పని చేస్తున్నారు.

## ఐసర్ తొలి డైరెక్టర్ గణేష్‌కు పద్మశ్రీ

**తి**రుపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐసర్) డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.గణేష్‌కు సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో పద్మశ్రీ పురస్కారం వరించింది. 1953లో జన్మించిన ఆయన 1970లో బిఎస్సీ, 1972లో బెంగళూరు విశ్వవిద్యాలయం నుంచి రసాయనశాస్త్రంలో పీజీ పట్టా పొందారు. 1976లో ఢిల్లీ

విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ సాధించారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో రెండో పీహెచ్‌డీ చేశారు. 1981లో హైదరాబాద్‌లోని సెంటర్ అండ్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబి)లో చేరారు. అక్కడ దేశంలోనే తొలి డీఎన్ఏ సంశ్లేషణ (సింథసిస్) సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. 1987లో జాతీయ కెమికల్ లేబొరేటరీ (ఎన్‌సీఎల్, సీఎస్ఐఆర్)కు వెళ్లారు. అక్కడ 1994లో ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగానికి అధిపతి అయ్యారు. 2006లో పుణెలో ఏర్పాటు చేసిన ఐసర్‌కు తొలి డైరక్టర్‌గా నియమితులయ్యారు. గుర్తింపు పొందిన జర్నల్స్‌లో 170 ప్రచురణలు ఉన్నాయి. రెండు అంతర్జాతీయ పేటెంట్ హక్కులు సొంతం చేసుకున్నారు. శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డుతో పాటు ద వరల్డ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (టీడబ్ల్యు ఏఎస్) బహుమతి సహా పలు అవార్డులు అందుకున్నారు.

## ఏటికొప్పాక బొమ్మల ఖ్యాతి సీవీ రాజు

**ల**క్కబొమ్మల తయారీలో ప్రఖ్యాత కళాకారుడు చింతలపాటి వెంకటపతి రాజు (సీవీ రాజు) హస్తకళలను బతికించేందుకు చాలా కృషి చేశారు. ఈయన పదోతరగతి పూర్తిచేసే సమయానికి ప్రస్తుత అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం ఏటికొప్పాకలో పేరున్న హస్తకళాకారులు కళకు ఆదరణ లేక గ్రామాన్ని విడిచి కూలి పనులకు వలసపోయేవారు. ఇది చూసిన ఆయన ఏటికొప్పాక పేరును తిరిగి నిలబెట్టాలని లక్కబొమ్మల పరిశ్రమపై దృష్టి సారించారు. ఢిల్లీ వెళ్ళి అధ్యయనాలు చేశారు.

1999లో ఏటికొప్పాకలో హస్తకళా నిలయాన్ని ఏర్పాటు చేసి కళాకారులకు ఆధునిక బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చారు. వారు తయారుచేసిన బొమ్మలకు వారే ధర నిర్ణయించుకునేలా చేశారు. బొమ్మలను విదేశాలకు పంపితే గిట్టుబాటు ధర లభించడంతో పాటు గ్రామం పేరు ప్రపంచస్థాయికి వెళ్తుందని ఆశించారు. కానీ బొమ్మల్లో వాడిన రంగుల్లో రసాయనాలు ఉన్నాయని విదేశీయులు వీటిని తిరస్కరించారు. దీంతో ఆయన ప్రకృతిసిద్ధమైన రంగులు తయారుచేస్తే ఈ ఇబ్బంది ఉండదని భావించారు. పసుపు, ఇండిగో పిక్కలు, జాప్రా, కరక్కాయి తదితరాలతో ప్రకృతిసిద్ధమైన రంగుల తయారీకి శ్రీకారం చుట్టారు. దీంతో ఇక్కడి బొమ్మలు విదేశాలకు ఎగుమతయ్యాయి.

## ఖలిస్తాన్ ఉన్మాదులు చీకటి నింపినా వెలుగులు పంచుతున్న 'సంకురాత్రి'

**డా**క్టర్ చంద్రశేఖర్ సంకురాత్రి... ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 1943 నవంబరు 20న జన్మించారు. రాజమహేంద్రవరంలో ప్రాథమిక, కళాశాల విద్య చదివారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జువాలజీలో పీజీ చేసి, కెనడాలో అల్బెర్టా విశ్వవిద్యాలయంలో పీహెడీ పొందారు. 1985 జూన్ 23న భార్య మంజరి, ఇద్దరు పిల్లలతో విమానంలో భారతదేశానికి బయల్దేరారు. కెనడా నుంచి ఢిల్లీకి వస్తున్న ఆ విమానాన్ని ఖలిస్థాన్ వేర్పాటు వాదులు పేల్చేశారు. ఈ దారుణ ఘటన చంద్రశేఖర్ జీవితాన్ని కుదిపేసింది.

తర్వాత కెనడా నుంచి భారతదేశానికి తిరిగొచ్చి, సంకురాత్రి పౌండేషన్ స్థాపించారు. గ్రామీణ పేద విద్యార్థుల కోసం పాఠశాల స్థాపించారు. ఆ పాఠశాల ఇప్పుడు శారదా విద్యాలయంగా ఎందరికో విద్య అందిస్తోంది. నాణ్యమైన కంటి వైద్యం అందించడానికి 1993 జనవరి 21న శ్రీకిరణ్ నేత్ర చికిత్సాలయం ప్రారంభించారు. ఇప్పటివరకూ 37 లక్షల మందికి నాణ్యమైన కంటి వైద్యం అందించారు. 3.40 లక్షల మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు.

## ఆర్కిడ్ శాస్త్రవేత్త అబ్బిరెడ్డికి పద్మశ్రీ

పద్మశ్రీ వరించిన ఆర్కిడ్ శాస్త్రవేత్త డాక్టర్ అబ్బిరెడ్డి నాగేశ్వరరావు ఏలూరుకు చెందినవారు. 33 రకాల ఆర్కిడ్స్ జాతులను కనుగొన్నారు. 1982లో అరుణాచల్ పర్యావరణ అటవీశాఖలో చేరారు. స్టేట్ ఫారెస్ట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్లో ఆర్కిడాలజిస్ట్‌గా 30 ఏళ్లు పని చేశారు. ఆగస్టు 2012 నుంచి మార్చి 2016 వరకు మణిపూర్ హెంగ్‌బంగ్‌లోని ఆర్కిడ్ జీన్ కన్జర్వేషన్ సెంటర్‌కు డైరెక్టరుగా పని చేశారు. తన అన్నయ్య ప్రోత్సాహంతో ఇంత ఎత్తుకు ఎదిగానని 68 ఏళ్ల అబ్బిరెడ్డి తెలిపారు.



'పద్మశ్రీ అవార్డుకు ఎంపికవడం చాలా ఆనందంగా, సంతోషంగా ఉంది. 45 ఏళ్ల కృషికి గుర్తింపు లభించిందనుకుంటున్నా'నని ఆయన అన్నారు.

## నీలి విప్లవ విజయ కేతనం!

**భా**రతదేశంలో నీలి విప్లవానికి దశ, దిశ చూపించిన పరిశోధకుడు విజయ్ గుప్తా. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆయనకు తెలంగాణ కోటాలో పద్మశ్రీ వరించింది. మోదడుగు విజయ్ గుప్తా 1939లో బాపట్లలో జన్మించారు. బాపట్ల హైస్కూలులో ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదువుకున్నారు. గుంటూరులో బీఎస్సీ పూర్తి చేశారు. అసోంలోని సిమ్‌సాగర్ కళాశాలలో జువాలజీకి హెడ్‌గా పనిచేశారు. అక్కడే ఫిషరీస్ రీసర్చ్‌లోకి ప్రవేశించి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆపైన... మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి గుప్తా అహరహం శ్రమించారు. ఆయన సేవలకు గుర్తింపుగా వరల్డ్ ఫుడ్ ప్రైజ్ అవార్డు వరించింది.

## మానసిక దివ్యాంగ బాలల వైద్యుడికి పద్మశ్రీ

**మా**నసిక ఎదుగుదల లేని పిల్లలకు విశేష సేవలందిస్తున్న ప్రముఖ పిల్లల వైద్యుడు పసుపులేటి హనుమంతరావుకు వైద్య రంగంలో పద్మశ్రీ వరించింది. హనుమంతరావు 1945 సెప్టెంబరు 16న హైదరాబాద్ పాతబస్తీలోని మెడికల్ ప్రాక్టీషనర్ల కుటుంబంలో జన్మించారు. 1964లో కాకతీయ మెడికల్ కాలేజీలో విద్యనభ్యసించారు. ఆ తర్వాత నీలోఫర్ ఆస్పత్రిలో పీడియాట్రిక్స్‌లో ఎండీగా చేశారు. ముంబైలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్‌లో రిహాబిలిటేషన్ మెడిసిన్‌లో శిక్షణ పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి రిహాబిలిటేషన్ సైకాలజీలో పీహెచ్‌డీ చేశారు.

1977లో వికలాంగుల పునరావాసం గురించి సమాజంలో సేవ కార్యక్రమాలు నిర్వహించారు. మానసిక వికలాంగులకు ప్రత్యేక ఆస్పత్రి ప్రారంభించి ఎందరో పిల్లలకు చేయూతనందించారు. ఆయన స్థాపించిన పలు యూనిట్లతో రోజుకు సుమారు 1700 మంది సేవలు పొందుతున్నారు. మానసిక వికలాంగులకు పునరావాసం కల్పించడంలో ఎంతో కృషి చేశారు. వృద్ధులు, వితంతువులు, నిరుపేదల సంరక్షణ, తదితర రంగాలలో సేవలు అందిస్తున్నారు. పిల్లల, రిహాబిలిటేషన్, సైకాలజీ వైద్యుడిగా అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందారు.

హనుమంతరావుని 'ఆంధ్రజ్యోతి' పలకరించగా...

## అంకుడు కర్ర కళాఖండాలకు గుర్తింపు

**అ**నకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామానికి చెందిన హస్త కళాకారుడు చింతలపాటి వెంకటపతిరాజుకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించింది. ఏటికొప్పాకలో జన్మించిన వెంకటపతిరాజు పదో తరగతి వరకు చదువుకున్నారు. ఆ తరువాత హస్తకళా రంగంలోకి ప్రవేశించారు.

అంకుడు కర్ర సహాయంతో అద్భుత కళాఖండాలను తయారుచేయడంతోపాటు సహజసిద్ధ రంగులను వినియోగించడం వెంకటపతిరాజు ప్రత్యేకత. గ్రామంలో 35 సంవత్సరాలుగా ఆయన హస్తకళా నిలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ పురస్కారాన్ని హస్త కళారంగానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నానని ఆయన 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

(ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికల సౌజన్యంతో ...)

■

స్వార్థం లేకుండా వుండడమే అన్ని నీతులలోకి గొప్పనీతి. స్వార్థంతో కూడిన ప్రతి పనీ ప్రగతిని అడ్డుకునేదే

# తుపాను, తెగుళ్ళతో కునారిల్లిన కంది పంట!

**కం**ది రైతుకు కన్నీరే మిగిలింది. మాండస్ తుఫాన్ వారి వెన్ను విరిచింది. కోలుకోలేని దెబ్బ తీసింది. భారీ వర్షాలకు పూత, పిందె రాలిపోయింది. అనంతరం తెగుళ్ళు విజృంభించాయి. వాటి నివారణకు పురుగు మందులు వాడినా అదుపులోకి రాలేదు. ఇటు వర్షాలు, అటు తెగుళ్ల దాడితో కొన్నిచోట్ల పంట తుడిచి పెట్టుకు పోయింది. మరికొన్ని చోట్ల క్వింటాల్ దిగుబడి కూడా వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. దీంతో ఎకరాకు రూ. 20వేలు పెట్టుబడి పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలిఖర్చులు కూడా రావని భావించిన కొందరు పంటను జీవాలకు మేతగా వదిలేస్తున్నారు.

ప్రకాశం జిల్లా పీసీపల్లి మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 13.26 వేల ఎకరాల్లో రైతులు కందిని సాగు చేశారు. పెద్దన్నపల్లి, తలకొండపాడు, ముద్దపాడు, పడమటిపల్లి, మాచర్లవారిపల్లి, పీసీపల్లి, పెదఅలవలపాడు, నేరేడుపల్లి, లక్ష్మక్కపల్లి, బట్టుపల్లి, వెంగళాయపల్లి, వేపగుంపల్లి, పోతవరం తదితర గ్రామాల్లో ఎక్కువ విస్తీర్ణంలో కందిసాగైంది.

ముందుగానే పైరు ఏపుగా పెరుగుతుండటంతో వారిలో ఆశలు చిగురించాయి. అధిక దిగుబడులు వస్తాయని, భారీగా ఆదాయం పొందవచ్చని ఆనందించారు. ఈ సమయంలో మాండస్ తుఫాన్ విరుచుకుపడింది. ఈ ముసురుకు పూత మొత్తం నేలరాలింది. దీంతోపాటు మరికొన్ని పొలాల్లో కుచ్చు తెగులుతో చెట్టుపై ఆకులు చెందులా కట్టుకుపోయాయి. వేరుకుళ్లు తెగులు వ్యాపించింది.

కొన్ని పొలాల్లో చెట్లు ఎండిపోతుండగా, మరికొన్ని చోట్ల ఏపుగా పెరిగిన చెట్లు పూత, పిందె లేకుండా దూసుకుపోయాయి. రైతులు రసాయనిక మందులను పిచికారీ చేసినా మళ్లీ పూతరాక, కాయ కాయక చెట్లు అలాగే మిగిలిపోయాయి. దీంతో కనీసం ఎకరాకు క్వింటాల్ దిగుబడి కూడా వచ్చేలా కనిపించడం లేదు.

ఇప్పటికే రైతులు ఎకరాకు దుక్కికి రూ. 3 వేలు, విత్తనాలకు రూ. 1000, కౌలు రూ. 3వేలు, కలుపుతీత రూ. 2వేలు, సేద్యానికి రూ. 3వేలు, ఎరువులు, పురుగు మందులకు రూ. 3వేలు, ఇతర ఖర్చులు మొత్తం కలుపుకొని రూ. 20వేల వరకు ఖర్చుపెట్టారు. ఓ వైపు తుఫాన్, మరోవైపు తెగుళ్లతో ఆశించిన స్థాయిలో పంట పండక పోవడంతో అప్పుచేసి పెట్టుబడి పెట్టిన రైతులు ఆందోళన చెందు తున్నారు. కొందరు కందిపైరులో గొర్రెలు, మేకలను తోలి మేపుతూ వాటి ఆకలి తీరుస్తున్నారు. పంటల బీమా అందించి తమను ఆదుకోవాలంటూ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

**తుఫాన్ దెబ్బతీసింది**

కందిపూతకు వస్తున్న దశలో మాండస్ తుపాను కంది కాపుపై ప్రభావం చూపింది. కంది మొక్కలకు పూసిన పూత నేల రాలింది. రెండోసారి పూత వస్తుందేమోనని ఎన్నో మందులను పిచికారీ చేశాను. అయినా ఫలితం లేదు. నేను 8 ఎకరాల కంది సాగు చేస్తే ఇప్పటివరకు రూ. 1.20 లక్షలు పెట్టుబడి పెట్టాను. ప్రస్తుతం ఎకరాకు క్వింటా కూడా దిగుబడి వచ్చేలా లేదు. ప్రభుత్వం బీమా అందించి కంది రైతులను ఆదుకోవాలి.

*– నెలకుర్తి కాంతయ్య, రైతు, పెద్దన్నపల్లి*

**పెట్టుబడి పెరిగింది**

గతేడాదితో పోలిస్తే ఈసారి కంది పంటకు పెట్టుబడి పెరిగింది. ఏపుగా పెరుగుతున్న దశలో పైరుకు తెగుళ్లతోపాటు చీడపీడలు ఆశించాయి. వీటి నివారణకు ఎక్కువసార్లు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. దీంతో పెట్టుబడి పెరిగింది. దిగుబడి రావడం లేదు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

*– వేమూరి సుబ్బరాయుడు, రైతు, మాచర్లవారిపల్లి*

■

# వరి సాగు వద్దంటున్న ' అన్నపూర్ణ ' !

**ఆ**హారధాన్యాల ఉత్పత్తుల్లో 'అన్నపూర్ణ'గా ఆంధ్రప్రదేశ్‌కు పేరు. అలాంటి రాష్ట్రంలో వరిసేద్యం నుంచి రైతులు తప్పుకుంటుండడం కలవరపరుస్తోంది. వరిసాగు, దిగుబడులు, క్రయ విక్రయాలపై నిర్దిష్ట ప్రణాళికలు లేకపోవడం, పండించిన వరి పంటంతా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం, మిల్లర్లకు అమ్ముకోవడానికీ కొన్ని నిబంధనలు అడ్డంకిగా మారడం, సేకరించిన ధాన్యానికి వెంటనే సొమ్ము అందకపోవడం, మరోవైపు విపత్తులతో ఏటా పంట దెబ్బ తినడం, సకాలంలో పరిహారం అందకపోవడం, సాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి, రెండు పంటలకు సకాలంలో, సక్రమంగా నీరందకపోవడం, చీడపీడలతో దిగుబడులు తగ్గడం, ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడం, దళారులకు అమ్మితే డబ్బులు ఎగ్గొట్టడం వంటి అనేక సమస్యల కారణంగా, గత రెండేళ్లుగా రాష్ట్రంలో కొందరు రైతులు వరి సాగుకు స్వస్తిచెప్పి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మరలుతున్నారు.

రాష్ట్రంలో సార్వా సీజన్‌లో 40లక్షల ఎకరాలు, దాళ్వా కింద 21లక్షల ఎకరాల్లో వరి సాగు జరగాలని వ్యవసాయ శాఖ ఏటా లక్ష్యంగా పెట్టుకుంది. కానీ గతేడాది నుంచి వరి సాగులో చాలా వ్యత్యాసం వస్తోంది. 2019 ఖరీఫ్‌లో 36.67లక్షల ఎకరాలు, రబీలో 20.17 లక్షల ఎకరాలలో వరి సాగు కాగా, 2022 ఖరీఫ్‌లో 35.97లక్షల ఎకరాల్లో వరి సాగవ్వగా, 2022-23 రబీలో ఇప్పటివరకు 5.12 లక్షల ఎకరాల్లోనే సాగులోకి వచ్చింది. ఈ సీజన్‌లో 20.77లక్షల ఎకరాల్లో వరి వేయాల్సి ఉండగా, ఇప్పటికి 26% మాత్రమే నాట్లు పడ్డాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు ముందే సాగునీరు విడుదలచేసినా, 8శాతం వరిసాగు తగ్గింది. ప్రస్తుత రబీలోనూ వరిసాగు బాగా తగ్గే పరిస్థితి కనిపిస్తోంది.

**సగం ధాన్యం కూడా కొనలేదు**

రాష్ట్రంలో పండించే ధాన్యంలో సగం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయడంలేదు. ప్రస్తుత ఖరీఫ్‌లో 36 లక్షల ఎకరాల్లో (సగటున ఎకరానికి 35బస్తాల చొప్పున) 95 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా... రాష్ట్ర ప్రభుత్వం 37లక్షల టన్నులు కొనుగోలు చేస్తామని ప్రకటించింది. వరి కోతలు దాదాపు పూర్తి కావస్తున్నా, గత రెండు నెలల్లో కేవలం 20లక్షల టన్నుల ధాన్యం మాత్రమే సేకరించింది. మిగిలిన ధాన్యాన్ని ప్రభుత్వ రంగ సంస్థలు కొనుగోలు చేయడం లేదు. పైగా రైతులెవరూ ధాన్యాన్ని మిల్లర్లకు నేరుగా అమ్ముకోకుండా ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. దీంతో మిగిలిన ధాన్యాన్ని మద్దతు ధర కన్నా తక్కువకే మధ్యవర్తులకు అమ్ముకోవాల్సి వస్తోంది.

మరోవైపు క్వింటాల్ ధాన్యం రూ. 2060 మద్దతు ధరకు అమ్ముతున్న రైతులు, 25 కేజీల బియ్యం రూ. 1500 పెట్టి కొని ఇంటికి తీసుకెళుతున్నారు. అంటే.. కిలోధాన్యం రూ. 20కి అమ్ముడుపోతుంటే, రూ. 60కు కేజీ బియ్యం తీసుకోవా

### ఉద్యాన,ఆక్వా సాగుపట్ల రైతుల ఆసక్తి

**త**క్కువ పెట్టుబడితో, తక్కువ సమయంలో అధిక దిగుబడి, ఎగుమతి సౌకర్యం ఉన్న ఉద్యాన, ఆక్వా సాగు వైపు అవకాశం ఉన్నచోట రైతులు మొగ్గు చూపుతున్నారని పౌర సరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి. వీరపాండియన్ తెలిపారు.

'ధాన్యమంతా సర్కార్ కొనదు.. మిల్లర్లను కొన నివ్వదు' అనే అంశంపై వివరణ ఇస్తూ.. 2021-22 ఖరీఫ్‌లో 40.21లక్షల టన్నులు, రబీలో 26.22 లక్షల టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించినట్లు తెలిపారు. ఈ ఏడాది ఆర్బీకేల వద్ద ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఏ ఒక్క మిల్లరు రైతును సంప్రదించకుండా జాగ్రత్తలు తీసుకున్నామని, మిల్లర్‌కు ఏ రైతు నుంచి ధాన్యం వచ్చిందో కూడా తెలియదని చెప్పారు. దళారులు, మధ్యవర్తులను నమ్మి మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం అమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు.

# పత్తి ధర తగ్గె.. దిగుబడీ తగ్గె!

తెలంగాణా రాష్ట్రంలో రైతులకు పత్తి పంట కలిసి రావడం లేదు. ఏటికేడాది నష్టాలే మిగుల్చుతోంది. వరసగా మూడో ఏడాదీ నిరాశే మిగిల్చింది. అతివృష్టి, కుండపోత వానలతో జాలుపట్టిన పంట చేలు, చీడపీడలు, తెగుళ్లతో పత్తి దిగుబడి పాతాళానికి పడిపోయింది. ఎకరానికి సగటున 12 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. ఈసారి 8 క్వింటాళ్లకు మించి రావడం లేదు. కుమ్రంభీం ఆసిఫాబాద్ లాంటి జిల్లాల్లో ఎకరానికి నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు దిగుబడి తగ్గడం, మరోవైపు గత ఏడాది కంటే క్వింటాకు రూ.4 వేలు ధర తగ్గడంతో రైతులు సుమారు రూ.32 వేల కోట్లు నష్టపోతున్నట్లు అంచనా.

ఈఏడాది రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. ఎకరానికి సగటున 12 క్వింటాళ్ల చొప్పున 60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావాలి. కానీ, సగటు దిగుబడి 8 క్వింటాళ్లు మాత్రమే వస్తోంది. అంటే 40 లక్షల మెట్రిక్ టన్నులే వస్తున్నట్లు లెక్క. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో పత్తి ధర క్వింటాలుకు రూ.8 వేలు ఉంది. గత ఏడాదితో పోలిస్తే క్వింటాలుకు రూ.4 వేల ధర తగ్గింది. ఈ లెక్కన రాష్ట్రంలో ఉత్పత్తయిన పత్తి 40 లక్షల మెట్రిక్ టన్నులు కాగా.. ఒక టన్నుకు రూ.40 వేల చొప్పున పత్తి రైతులు రూ.16 వేల కోట్లు నష్టపోయారు.

**ఇంట్లోనే ఉంచేశా..**

మొత్తం 17 ఎకరాల్లో పత్తి సాగు చేశా. వాతావరణం అనుకూలించలేదు. కనీసం 204 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా.. 150 క్వింటాళ్లే వచ్చింది. ధర కూడా తక్కువగా ఉంది. అందుకే ఖర్చుల కోసం 14 క్వింటాళ్లు అమ్ముకున్నా. ఇంకా 136 క్వింటాళ్ల పత్తిని ఇంట్లోనే నిల్వ చేశా. ధర పెరిగితే అమ్ముదామని చూస్తున్నా. రూ.10-12 వేలు వస్తే అమ్ముతా.

*- మెస్రం మనోహర్, ఉమ్రి గ్రామ రైతు*

ల్సిన పరిస్థితి! మంచిబియ్యాన్ని రేషన్‌కు, హాస్టళ్ళు, అంగన్ వాడీల్లో వినియోగించి, నాసిరకం బియ్యాన్ని, నూకలుగా మారిన బియ్యాన్ని ఇథనాల్ తయారీకి వినియోగించవచ్చు. ఇథనాల్‌పై జీఎస్టీని 5 శాతానికి తగ్గించినందువల్ల, దానికిప్పుడు డిమాండ్ ఉందని, దీన్ని ఉపయోగించుకుంటే, ప్రభుత్వం ఆదాయాలను పెంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. గత మూడేళ్లలో వరి సాగు తగ్గగా,3.5 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల విస్తీర్ణం పెరిగింది. కృష్ణా, గోదావరి డెల్టాలతో పాటు నాగావళి, వంశధార వంటి ప్రాజెక్టుల పరిధిలోనూ, రాయలసీమ జిల్లాల్లోనూ వరికి బదులు కొందరు రైతులు అరటి, బొప్పాయి, కూరగాయ పంటలు పండిస్తున్నారు. కొందరు మిర్చి, పత్తి, అపరాల పంటలు వేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

## రైతు నేస్తం సమాఖ్య సందర్శన యాత్ర

రైతు నేస్తం సమాఖ్య – అనంతపురం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లకు శిక్షణ మరియు సందర్శన యాత్ర కార్యక్రమాన్ని కదిరిలోని మైరాడ ట్రైనింగ్ సెంటర్‌లోప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి 7 రైతు సంస్థల నుండి 12 మంది బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు హాజరయ్యారు. 5 ఎఫ్.పి.ఓ. సిఈఓ లు ఐదుగురూ హాజరు అయ్యారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సమాఖ్య ఉద్దేశము, ఏర్పాటు, నిర్మాణము, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల విధులు బాధ్యతలు, వ్యాపార కార్యక్రమాలను గూర్చి వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో చిత్తూరు –అన్నమయ్య జిల్లాల రైతు సమాఖ్య యం. టమాట ఫెడరేషన్ సిఈఓ శ్రీమతి మంజుల సమాఖ్య విధివిధానాలు, వ్యాపార కార్యక్రమాల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమం బిడిఓ సంజీవ ప్రాజెక్టు మేనేజర్లు నరసింహారావు, గోపాలరాజు ఫెసిలిటేషన్ చేశారు. ■

ఆదర్శమైన పనికోసం చేసే ప్రయత్నంలో వేయి సార్లు ఓటమి చవిచూసినా మరో మారు ప్రయత్నించండి

# లాభసాటి రొయ్యల సాగుకోసం కొత్త ప్రతిపాదనలు !

**ఆ**క్వా ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానిది ప్రత్యేక స్థానం. అయితే, కొంతకాలంగా విదేశాలకు ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు మందగించడం ఈ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. రొయ్యల ధరలు తగ్గిపోవడం.. పెట్టుబడుల భారం పెరిగిపోవడంతో ఆక్వా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఎగుమతులకు ప్రభుత్వాల నుంచి తగిన సహకారం అందకపోవడంతో ఇక, గత్యంతరం లేని పరిస్థితుల్లో స్థానిక మార్కెట్లలో విక్రయాల ద్వారా నష్టాల నుంచి గట్టెక్కాలని యోచిస్తున్నారు. ఇందుకోసం ఆక్వా ఉత్పత్తుల వినియోగం ఆవశ్యకతపై 'ప్రాన్ ఫుడ్ ఫెస్టివల్' పేరుతో తీరప్రాంత జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆక్వా రైతు సంఘం నిర్ణయించింది.

మొదటగా జనవరి 8న కాకినాడలో 'ప్రాన్ ఫుడ్ ఫెస్టివల్'ను నిర్వహించారు. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల కోసం అందుబాటులో ఉన్న కోల్డ్ చైన్, లాజిస్టిక్స్‌ను వినియోగించి, స్థానిక మార్కెట్లకు ఉత్పత్తుల రవాణా, రెస్టారెంట్లలో ఫుడ్ ప్యాకింగ్ ద్వారా వ్యాపారాన్ని వృద్ధి చేసుకునే అంశాలపై అటు వ్యాపారులకు, ఇటు వినియోగదారులకు అవగాహన కల్పించాలనేది ఈ 'ప్రాన్ ఫుడ్ ఫెస్టివల్స్' ఉద్దేశం.

స్థానిక మార్కెట్లలో ఆక్వా ఉత్పత్తుల విక్రయాలకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటు సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు రొయ్యల వంటకాలు రుచి చూపించేలా చర్యలు తీసుకుంటే, ఆక్వారైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్న అంశాన్ని పరిశీలించాలని ప్రభుత్వానికి విన్నవించాలని కూడా ఆక్వా రైతు సంఘం నిర్ణయించినట్లు సమాచారం.

వ్యవసాయ, ఉద్యాన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రానప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకుని, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేసి, తిరిగి వేలం ద్వారా విక్రయిస్తున్న విధంగానే ఆక్వా ఉత్పత్తుల కొనుగోలు విషయంలోనూ ప్రభుత్వ జోక్యాన్ని ఆక్వా రైతులు ఆశిస్తున్నారు. కేవలం ధరలు నిర్ణయించడం వల్ల ఫలితం ఉండదని, ఈ ప్రతిపాదన చేస్తున్నట్లు సంఘం నేతలు చెప్పారు. రొయ్యలు, చేపల ఎగుమతుల్లో కీలకమైన 'ఐస్' పై జీఎస్టీ లేకపోయినా, ప్యాకేజ్డ్ ఫుడ్‌పై 12-18% వరకు జీఎస్టీ పడుతోంది. అందువల్ల రాష్ట్రంలో వినియోగించే ఆక్వా ఉత్పత్తులపై జీఎస్టీని మినహాయిస్తే, అటు రైతులకు, ఇటు వ్యాపారులకు భారం తగ్గి, రొయ్యల అమ్మకాలను పెంచుకోవడానికి ఆస్కారం ఉంటుందని ఆక్వా రైతు సంఘం అభిప్రాయపడుతోంది.

రాష్ట్రంలో 16.50 లక్షల మంది ఆక్వా రంగంపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. దేశంలో ఏటా 10.17లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతుంటే అందులో 7.89 లక్షల మెట్రిక్ టన్నుల రొయ్యలు (అంటే దేశం మొత్తం ఉత్పత్తిలో 77.5%) ఏపీలోనే ఉత్పత్తి అవుతున్నాయి. కానీ సగం కూడా ఎగుమతి కావట్లేదు.

దాణా ధరల పెరుగుదల, రొయ్యల ధరల తగ్గుదలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం 100 కౌంట్ రొయ్యలు కిలో రూ.220 మించడం లేదు. ఇవే రొయ్యలకు ఉత్పత్తి వ్యయం రూ.280 దాకా అవుతోందని, కనీసం రూ.300 చొప్పున అమ్ముడుపోతేనే సాగుదారులకు లాభమని రైతులు అంటున్నారు. కానీ ప్రభుత్వం మంత్రుల కమిటీ వేసి నిర్ణయించిన ధర కూడా దక్కక, ఆక్వా సాగుదారులు నష్టాల పాలవుతున్నారు.

దీంతో క్రాప్ హాలిడే పాటించాలని కొందరు రైతులు నిర్ణయించగా, ఈ రంగంపై ఆధారపడిన వారంతా జీవనోపాధి సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, స్థానికంగానైనా వినియోగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం ప్రభుత్వాన్ని కోరుతోంది. (ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

జీవితమంతా ఇవ్వడమే అని తెలుసుకో, యివ్వనని భీష్మిస్తే ప్రకృతే బలవంతంగానైనా నీతో యిప్పిస్తుంది

# మీ కాలేయాన్ని గురించి కాస్త పట్టించుకోండి !

**న**చ్చింది తినవచ్చు, తాగవచ్చు. నచ్చినట్టు బ్రతకవచ్చు. కాని, అందుకు కాలేయం బలి కాకుండా చూసుకోవాలి. అలవాట్ల మూలంగా, జన్యుపరంగా, వంశపారంపర్యంగా సంక్రమించే వ్యాధులబారిన పడకుండా కాలేయాన్ని కాపాడుకోవాలంటే కొన్ని ముందు జాగ్రత్త చర్యలు పాటించక తప్పదు. కాలేయం తనను తాను మరమ్మతు (రిపేర్) చేసుకోగలుగుతుంది కాబట్టి సాధారణంగా కాలేయ వ్యాధుల లక్షణాలు బయల్పడవు. కేవలం కామెర్ల వ్యాధి ఒక్కటే కాలేయం జబ్బు పడిందనడానికి సూచనగా మనం భావిస్తూ ఉంటాం. కానీ నిజానికి కాలేయ వ్యాధుల లక్షణాలు చాప కింద నీరులా శరీరంలో అంతర్గతంగా చోటు చేసుకుంటూ ఉంటాయి. కాలేయం దెబ్బ తిన్నప్పుడు, శరీరంలో లివర్ ఎంజైమ్స్ పెరిగిపోవడం, నిస్సత్తువ, లైంగికాసక్తి తగ్గిపోవడం లాంటి లక్షణాలు కొందర్లో కనిపిస్తాయి. ఇలాంటప్పుడు బలహీనతను వదిలించుకోవడం కోసం, ఎక్కువ మంది మల్టీవిటమిన్ సప్లిమెంట్ల మీద ఆధారపడుతూ ఉంటారు. కానీ మనం తీసుకునే ప్రతి మాత్రనూ కాలేయం తనలో యిముడ్చుకుంటుంది. ఫలితంగా అప్పటికే దెబ్బతిన్న కాలేయం మరింత దెబ్బ తింటుంది.



**ఈ లక్షణాల మీదా కన్నేయాలి**

- కాలేయం పని చేయడం మానేసినప్పుడు కొన్ని స్పష్టమైన లక్షణాలు మొదలవుతాయి. అవేంటంటే...
- కళ్లు, మూత్రం పచ్చబడడం కాళ్లు, పొట్ట వాపు
- సాయంత్రానికి పాదాలు వాచి, చెప్పులు పట్టకపోవడం
- కొద్ది దూరాల నడకకే ఆయాసం రావడం
- చర్మం తేలికగా గాయపడుతూ ఉండడం, నిద్ర లేమి
- ముక్కు, చిగుళ్ల నుంచి రక్తస్రావం
- మలం రంగులో మార్పులు

**వీళ్ళకు మరింత అప్రమత్తత అవసరం ....**

మధుమేహులు, ఊబకాయులు, డిస్‌లిపిడీమియా, మెటబాలిక్ సిండ్రోమ్ (నడుము చుట్టుకొలత ఎక్కువగా ఉన్న వాళ్లు), హైపర్‌టెన్షన్ వున్నవాళ్ళు, మందులతో మధుమేహం అదుపులోకి రానివాళ్లు, మద్యపానం అలవాటున్నవాళ్లు తప్పనిసరిగా కాలేయ పరీక్షలు చేయించుకోవాలి. కుటుంబ చరిత్రలో కాలేయ వ్యాధులు ఉంటే, మహిళలు 35 ఏళ్ల నుంచి, పురుషులు 40 ఏళ్ల నుంచి కాలేయ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి.

**మద్యం పరిమితంగా...**

ప్రపంచ ఆరోగ్య సంస్థ మద్యపానానికి సంబంధించి కొన్ని పరిమితులను సూచిస్తోంది. వారానికి ఏడు డ్రింక్స్‌కు మించి తీసుకునే మహిళలు, వారానికి 14 డ్రింక్స్‌కు మించి మద్యం సేవించే పురుషులు మోడరేట్ నుంచి హెవీ డ్రింకింగ్ కోవకు చెందుతారు. ఒక డ్రింక్ 10 నుంచి 12 గ్రాముల ఆల్కహాల్‌తో సమానం. వారంలో ఒకటిన్నర నుంచి రెంగు పెగ్గుల విస్కీకి మించి లేదా మూడు క్యానుల బీర్లకు మించి సేవించే వాళ్లను హెవీ డ్రింకర్లుగానే పరిగణించాలి. కేవలం రెండు గంటల వ్యవధిలో ఐదు బీర్లు తాగేస్తూ ఉంటారు. యువతలో ఇలాంటి బింజ్ డ్రింకింగ్ కూడా ప్రమాదకరమే! ఇలాంటి అలవాటు లివర్ డిస్‌ఫంక్షన్‌కు దారి తీస్తుంది.

**ప్రాథమిక పరీక్షలు ఇవే!**

లివర్ ఫంక్షన్ టెస్ట్, మంచి నాణ్యతతో కూడిన ఇమేజింగ్, అబ్డామిన్ అల్ట్రాసౌండ్, వైరల్ సిరాలజీ పరీక్షలతో కాలేయంలో ఏర్పడిన స్కార్ టిష్యూ పరిమాణాన్ని కనిపెట్ట వచ్చు. ఈ టిష్యూ ఎంత గట్టిపడిందనే దాని మీద వ్యాధి తీవ్రత ఆధారపడి ఉంటుంది. స్కార్ టిష్యూతో పాటు, ఫైబ్రోసిస్ కూడా ఎక్కువగా ఉంటే, కాలేయం సిర్రోసిసకు, సెల్యులర్ కార్సినోమాకు దారి తీసే ప్రమాదం ఉంటుంది.





**ఇలా కాలేయం ఆరోగ్యం**

స్కాన్‌లో గ్రేడ్ వన్ లేదా గ్రేడ్ టు ఫ్యాటీ లివర్ అనే ఫలితం వస్తే, అందర్లోనూ ఎంతో కొంత ఫ్యాటీ లివర్ ఉంటుందిలే అని విషయాన్ని తేలికగా తీసుకుంటాం. కానీ నిజానికి ఈ స్థితిని సీరియస్‌గానే పరిగణించాలి. వెంటనే కాలేయంలోని కొవ్వును కరిగించే చర్యలకు పూనుకోవాలి. సమతులాహారం తీసుకోవడంతో పాటు, క్రమం తప్పక వ్యాయామం చేయాలి. అలాగే మద్యపానం అలవాటు ఉన్నవాళ్లు పరిమితంగా తీసుకోవాలి. అలాగే బరువును అదుపులో ఉంచుకోవాలి.

బాడీ మాస్ ఇండెక్స్ 23 కంటే ఎక్కువ ఉన్నవాళ్లు హైపోక్యాలరి డైట్‌ను అనుసరించాలి. అలాగే వ్యాయామాన్ని దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. రోజు మొత్తంలో తీసుకునే ఆహారంలో 500 కిలో క్యాలరీలు కోత పడే ఆహారశైలిని అలవరుచుకోవాలి.

వారంలో 150 నుంచి 180 నిమిషాలకు తగ్గకుండా వ్యాయామం చేయాలి. వ్యాయామం గుండె కొట్టుకునే వేగాన్ని పెంచేలా ఉండాలి. ఇలా చేయగలిగితే కచ్చితంగా వారానికి ఒక పౌండు చొప్పున బరువు తగ్గే అవకాశం ఉంటుంది. తక్కువ కాలంలో ఎక్కువ బరువును తగ్గించేలా చేసే డైట్‌లు, ఇతరత్రా ప్రత్యామ్నాయ విధానాలతో శరీరంలోని నీరును కోల్పోతామే తప్ప, కొవ్వును కోల్పోలేం. పైగా అలాంటి పద్ధతుల్లో కోల్పోయిన బరువు, వాటిని ఆచరించడం ఆపేసిన వెంటనే తిరిగి పెరుగుతుంది. కాబట్టి శరీరంలోని కొవ్వు కరిగే వ్యాయామాన్ని ఎంచుకోవాలి.

మరీ ముఖ్యంగా చర్మం కింద ఉండే కొవ్వు కంటే అంతర్గత అవయవాల చుట్టూరా పేరుకునే కొవ్వు (విసరల్ ఫ్యాట్) ప్రమాదకరం. కాబట్టి ఆహారాన్ని పరిమితంగా తీసు కుంటూ, క్రమం తప్పక వ్యాయామం చేస్తూ, క్రమేపీ బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి.

బరువు తగ్గడం మూలంగా కాలేయంలో ఇన్‌ఫ్లమేషన్ తగ్గడంతో పాటు, స్కార్ టిష్యూ సాధారణ స్థితికి చేరుకోవడం మొదలుపెడుతుంది.

**ఆ చిట్కాలతో చేటే ఎక్కువ**

కలబంద రసం తాగడం, నోని ఫ్లవర్ ఎక్స్‌ట్రాక్ట్ తీసుకోవడం లాంటి సొంత ఆరోగ్య చిట్కాలు పాటించేవాళ్ల సంఖ్య పెరుగుతోంది. నిజానికి ఇలాంటి చిట్కాలన్నీ కాలేయానికి ప్రమాదకరం. బదులుగా తులసి, అల్లం, మిరియాలు, తేనె, పసుపు... ఇవన్నీ కాలేయానికి మేలు చేస్తాయి. అలాగే 'మిల్క్ థిసిల్' మూలిక, అన్ని రకాల కాలేయ వ్యాధులకు విరుగుడుగా పని చేస్తుందనే నమ్మకం విశ్వవ్యాప్తంగా ఉంది. నిజానికి దీన్లోని థైలిమెరీన్ అనే మూలకం కాలేయ వ్యాధులను నయం చేస్తుందని ఇప్పటివరకూ శాస్త్రీయంగా రుజువు కాలేదు.

**హెపటైటిస్ టీకా**

ఫ్యాటీలివర్ సిండ్రోమ్‌కు తోడ్పడే నాలుగు రకాల జన్యువులను ఇప్పటివరకూ గుర్తించడం జరిగింది. ఈ జన్యువులను కలిగి ఉన్నవాళ్ల కాలేయంలో కొవ్వు ఎక్కువగా పేరుకుంటూ ఉంటుంది. ఫైబ్రోసిస్, సిర్రోసిస్, కేన్సర్ ముప్పులుంటాయి. కాబట్టి కుటుంబ చరిత్రలో కాలేయ వ్యధిగ్రస్తులున్నవాళ్ల సంతానం రెట్టింపు అప్రమత్తంగా ఉండాలి. ఆరోగ్యకరమైన ఆహార, జీవనశైలులను పాటించడంతో పాటు హెపటైటిస్ బి వైరస్ సోకకుండా టీకాలు కూడా వేయించుకోవాలి.

**ఈ డైట్‌తో కాలేయం క్షేమం**

మెడిటరేనియన్ డైట్ కాలేయ ఆరోగ్యానికి ఉత్తమమైన ఆహారమని కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. పొట్టు తీయని పప్పు ధాన్యాలు, ఎక్కువ మొత్తాల్లో కూరగాయలు, ఆలివ్ నూనెలు కాలేయానికి మేలు చేస్తాయి.

**– డాక్టర్ ధర్మేష్ కపూర్, సీనియర్ హెపటాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్**

■

**దుస్థితిలో వున్నవారి కోసం నీవు పరితపించగలిగితే, నీకు అవసరమైన సహాయం అందితీరుతుంది**

# పన్ను ప్రయోజనాలు అందించే 5 పోస్టాఫీస్ పథకాలు

దీర్ఘకాలిక పొదుపును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పోస్టాఫీసు పొదుపు పథకాలను అందిస్తోంది. ఈ పథకాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా డబ్బు పొదుపు చేయడంతో పాటు. ఆదాయపు పన్ను ప్రయోజనాలను (టాక్స్ సేవింగ్) పొందొచ్చు. అలా మంచి రాబడితో పాటు పన్ను ప్రయోజనాలను అందించే పథకాలేంటో ఇప్పుడు చూద్దాం...

**ప్రజా భవిష్య నిధి (పిపిఎఫ్)**

దీర్ఘకాలిక పెట్టుబడులకు అనుకూలంగా ఉండడంతో పాటు.. 'ఈఈఈ' కేటగిరీలో పీపీఎఫ్ పన్ను ప్రయోజనాలను అందిస్తోంది. ఈ ఖాతాలో కనీసం రూ.500 నుంచి ఏడాదికి గరిష్ఠంగా రూ 1.50 లక్షల వరకు జమ చేయవచ్చు. మైనర్ల పేరుపైనా ఖాతా తెరవొచ్చు. ప్రస్తుత వార్షిక వడ్డీ రేటు 710%. ఈ పథకంలో 15 సంవత్సరాల మెచ్యూరిటీ పీరియడ్ ఉంటుంది. మెచ్యూరిటీ కంటే ముందే పెట్టుబడులను ఉపసంహరించుకోలేరు. అయితే, ఖాతా తెరిచిన మూడో సంవత్సరం నుంచి ఆరో సంవత్సరం వరకు రుణం తీసుకునేందుకు వీలుంటుంది. 7వ సంవత్సరం నుంచి పాక్షిక విత్ డ్రాలను అనుమతిస్తారు. ఖాతాలో చేసిన డిపాజిట్లపై సెక్షన్ 80సి కింద పన్ను. మినహాయింపు లభిస్తుంది.

**సుకన్య సమృద్ధి యోజన(ఎస్ఎస్‌వై)..**

ఈ పథకం ప్రత్యేకించి ఆడపిల్లల భవిష్యత్ కోసం ఉద్దేశించింది. 10 ఏళ్ల లోపు ఆడపిల్లల పేరుపై ఈ ఖాతా తెరవొచ్చు. ప్రస్తుత వార్షిక వడ్డీ రేటు 7.60%. ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ. 250, గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. ఈ ఖాతాకు 21 సంవత్సరాల మెచ్యూరిటీ పీరియడ్ ఉంటుంది. ఖాతా తెరిచిన నాటి నుంచి 15 సంవత్సరాలు పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ఆడపిల్లల ఉన్నత చదువుల కోసం, వివాహం కోసం నియమ నిబంధనలను అనుసరించి డబ్బు విత్ డ్రా చేసుకోవచ్చు. ఈ పథకంలో చేసే పెట్టుబడులపై కూడా సెక్షన్ 80సి కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. అలాగే వడ్డీ గానీ, మెచ్యూరిటీ మొత్తంపై గానీ పన్ను వర్తించదు.

**5-ఏళ్ల టైమ్ డిపాజిట్ స్కీమ్..**

5 సంవత్సరాల బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల మాదిరిగానే 5 ఏళ్ల పోస్టాఫీసు టైమ్ డిపాజిట్లపై కూడా ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా రూ.1.50 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందొచ్చు. ఈ పథకంలో కనీసం రూ.100 నుంచి పెట్టుబడులు పెట్టొచ్చు. గరిష్ఠ పరిమితి లేదు. ప్రస్తుతం త్రైమాసికానికి 5-ఏళ్ల పోస్టాఫీసు టైమ్ డిపాజిట్ రేటు 7 శాతానికి పెంచారు. ఇంతకు ముందు త్రైమాసికంలో ఇది 6, 70%గా ఉండేది.

**నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సి)**

"ప్రస్తుతం ఎన్ఎస్‌సీ పెట్టుబడులపై 7% వడ్డీ లభిస్తోంది. ఈ పథకంలో కనీసం రూ.100 నుంచి పెట్టుబడులు పెట్టొచ్చు. గరిష్ట పరిమితి లేదు. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.50 లక్షల వరకు సెక్షన్ 80సి కింద పన్ను మినహాయింపునకు అర్హత ఉంటుంది.

**సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సిఎస్ఎస్)..**

60 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసున్న పెద్దలు, స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన 55 నుంచి 60 ఏళ్ల లోపు వయసువారు ఇందులో చేరవచ్చు. ఈ పథకంలో రూ.1000 నుంచి రూ.15 లక్షల వరకు ఎంతైనా.. ఒకేసారి పెట్టుబడి పెట్టవచ్చు. పోస్టాఫీసు అందిస్తున్న పథకాల్లో అత్యధిక వడ్డీ రేటు ఇస్తున్న పథకం ఇది.

ప్రస్తుతం వార్షికంగా 8% వడ్డీ రేటు అందిస్తోంది. ఈ పథకంలో వడ్డీని త్రైమాసికంగా చెల్లిస్తారు. ప్రతి ఆర్థిక సంవత్సరం ఏప్రిల్, జులై, అక్టోబరు, జనవరి నెలల్లో మొదటి తేదీన వడ్డీ ఖాతాల్లో జమవుతుంది. ఈ పథకంలో పెట్టిన పెట్టుబడులపై కూడా సెక్షన్ 80సి కింద రూ.1.50 లక్షల వరకు పన్ను మినహాయింపు పొందొచ్చు. ■

**మనిషికి మనిషికీ మధ్య వుండే తారతమ్యం ఆత్మవిశ్వాసం వుండడం, ఆత్మ విశ్వాసం లేకపోవడం మాత్రమే**

# హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకునే ముందు ఏం చూడాలి?

**ఆ**రోగ్యంగా ఉన్నాం.. మాకెందుకు హెల్త్ ఇన్సూరెన్స్..? చాలామంది ఇలా అనుకుంటూ ఉంటారు. కానీ, ఈ ఆలోచన తప్పు. సంపన్నులకు హెల్త్ ఇన్సూరెన్స్ లేకపోయినా వచ్చే నష్టమేమీ ఉండదు. కానీ, సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు ఇది తప్పకుండా ఉండాలి. ఆర్థికంగా సమస్యల పాలు కాకుండా ఇది ఆదుకుంటుంది. 2020లో ఏం జరిగిందో ఓ సారి గుర్తు చేసుకోండి.

కరోనా ఇన్ఫెక్షన్ తీవ్రతతో ఉన్నవారు చికిత్స కోసం ఆసుపత్రిలో చేరితే.. రోజువారీ రూ.లక్షలు చొప్పున కార్పొరేట్ ఆసుపత్రులు బిల్లులు వడ్డించాయి. కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి ఎంతో మంది తమ ఆస్తులు అమ్ముకుని చెల్లింపులు చేయాల్సి వచ్చింది. అదే హెల్త్ ఇన్సూరెన్స్ ఉండి ఉంటే కొంత వరకైనా ఆదుకునేది. హెల్త్ ఇన్సూరెన్స్ ఉండడమే కాదు, తగినంత కవరేజీ కూడా అవసరమని కరోనా ఉపద్రవం తెలియజేస్తోంది. అందుకే ప్రతి కుటుంబానికి హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఉండాలి. అవివాహితులు కూడా ఇండివిడ్యువల్ ప్లాన్ తీసుకోవాలి.

**కవరేజీ ?**

ఎంత కవరేజీకి తీసుకోవాలన్నది ముఖ్యమైన అంశం. ఒక్కరికి ఎంత లేదన్నా కనీసం రూ.10 లక్షల కవరేజీ తీసుకోవాలి. వయసులో ఉన్నవారికి అంత కవరేజీ ఎందుకు? ఆరోగ్యంగా ఉన్నవారికి అంత అక్కర్లేదులే? ఇలాంటి వాదనలు పక్కన పెట్టాలి. ఎందుకంటే వైద్య చికిత్సల వ్యయాలు ఏటేటా 12–14 శాతం స్థాయిలో పెరుగుతున్నాయి. నేడు రూ.4–5 లక్షలు అయ్యే సర్జరీకి పదేళ్ల తర్వాత రూ.10–12 లక్షలు అవుతుంది. అప్పుడు కవరేజీ పెంచమంటే కంపెనీలు అధిక ప్రీమియం విధిస్తాయి. అందుకే ముందు నుంచే తగినంత కవరేజీ ఉండాలి.

కుటుంబం మొత్తానికి కలిపి తీసుకునేవారు రూ.10–20 లక్షల బేసిక్ కవరేజీ తీసుకుని, దీనికి సూపర్ టాప్ రూపంలో అదనపు కవరేజీ జోడించుకోవాలి. బేసిక్ ప్లాన్ రూ.10 లక్షలకు తీసుకుని, సూపర్ టాపప్ రూ.50 లక్షలకు తీసుకున్నారని అనుకుందాం. అప్పుడు హాస్పిటల్‌లో బిల్లు రూ.15 లక్షలు వచ్చిందనుకుంటే బేసిక్ ప్లాన్ కింద రూ.10 లక్షలు పోను అదనపు మొత్తాన్ని సూపర్ టాపప్ ఇచ్చిన బీమా సంస్థ చెల్లిస్తుంది. కాకపోతే ఇలా కవరేజీని వేరు చేయడం వల్ల ప్రీమియం భారం తగ్గుతుంది.

**ఏమి చూడాలి..?**

హెల్త్ ఇన్సూరెన్స్‌లో తప్పకుండా చూడాల్సినవి కొన్ని ఉన్నాయి. రూమ్ రెంట్‌కు పరిమితులు లేకుండా చూసుకోవాలి. రూమ్ రెంట్ పరిమితి ఉంటే, ఆ పరిమితికి మించిన వసతి పొందినప్పుడు అయ్యే చికిత్సా వ్యయాలకు బీమా సంస్థలు పూర్తి మొత్తం చెల్లించవు. పాలసీదారు కూడా కొంత భరించాలి. అందుకే రూమ్ రెంట్ పరిమితులు ఉండకూడదు. అంతేకాదు ఐసీయూ, వ్యాధుల వారీగా ఉప పరిమితులు ఉండకూడదు. అలాగే, కోపే లేకుండా చూసుకోవాలి. కోపే అంటే ప్రతీ క్లెయిమ్‌లో పాలసీదారు కొంత మేర చెల్లించేది. అది పోను మిగిలినది బీమా సంస్థలు చెల్లిస్తాయి.

నేడు వైద్యరంగం పురోగతి, టెక్నాలజీ ఫలితంగా కొన్ని చికిత్సలు ఆసుపత్రిలో చేరకుండానే తీసుకునే వెసులుబాటు ఉంది. వీటిని డే కేర్ చికిత్సలు అంటారు. అన్ని డే కేర్ చికిత్సలకు కవరేజీ ఉండాలి. కొన్ని చికిత్సలకు ఉప పరిమితులు ఉంటే ఆ ప్లాన్ తీసుకోకపోవడమే మంచిది. అలాగే, డోమిసిలరీ ట్రీట్‌మెంట్ ఫీచర్ కూడా ఉండాలి. అంటే ఆసుపత్రిలో కాకుండా ఇంటి నుంచే చికిత్స తీసుకుంటే చెల్లింపులు చేసేది. ఆర్గాన్ డోనర్ కవరేజీ కూడా ఉండాలి. భవిష్యత్తులో అవయవ మార్పిడి చికిత్స అవసరం పడితే.. దాత నుంచి అవయవం సేకరణకు అయ్యే వ్యయాలను చెల్లించేది. వార్షికంగాహెల్త్ చెకప్ ఫీచర్ ఉంటే

# అమెరికాలో లెఫ్టినెంట్ గవర్నర్‌గా తెలుగు మహిళ !

**అ**మెరికాలోని మేరీలాండ్ రాష్ట్రంలో తెలుగుమహిళ అరుణామిల్లర్ (58) చరిత్ర సృష్టించారు. ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. ఈ పదవిని చేపట్టిన తొలి ఇండియన్–అమెరికన్ ఆమే కావడం గమనార్హం. ఆమె తల్లిదండ్రులది ఆంధ్రప్రదేశ్. ఏడేళ్లవయసు ఉన్నప్పుడే అమెరికా వెళ్లి స్థిరపడ్డారు. మిస్సోరి యూనివర్సిటీ ఆఫ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి ఇంజనీరింగ్‌లో పట్టా పొందారు. ఆమె జన్మించిన ఏడాదికే 1965లో తండ్రి అమెరికా వెళ్లారు. ఆమెను అమ్మమ్మ వద్ద విడిచిపెట్టి భార్యతో కలిసి వెళ్లారు. మళ్లీ 1972లో వచ్చి అరుణను



తీసుకెళ్లారు. అంతవరకు తల్లిదండ్రులకు దూరంగానే పెరిగారు. ప్రారంభ ఉపన్యాసంలో బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. “నా తండ్రి నాకు పరాయివారు. నా తోబుట్టువులు, అమ్మకూడా పరాయివారే. వారు లేరన్న బెంగతోనే బాల్యమంతా గడిచింది. అందుకే ఇండియాలో నివసించిన అప్పటి విషయాలేవీ నాకు గుర్తుకు లేవు. ఒక పరాయి వ్యక్తిగా పరాయి దేశానికి వచ్చాను. నాదంటూ ఏమీలేని ఇక్కడ ఇమిడిపోవడానికే జీవితమంతా ప్రయత్నించాను. పురుష ఆధిపత్యం ఉన్న సమాజంలో మహిళా ఇంజినీరుగా, నాలాంటివారు ఎవరూ లేని సభలో ఇండియన్–అమెరికన్ శాసనకర్తగా పని చేశాను. ఉన్నతస్థానానికి తీసుకెళ్లిన మేరీలాండ్‌కు కృతజ్ఞతలు”అని పేర్కొన్నారు. రాజధాని వాషింగ్టన్‌కు ఆనుకొని ఉన్న మేరీలాండ్ గవర్నర్‌గా ప్రస్తుతం అమెరిన్–ఆఫ్రికన్ వెస్‌మూర్ ఎన్నిక కావడం విశేషం.

కాగా, మరోవైపు మిసోరీ రాష్ట్ర ఆర్థికమంత్రిగా వివేక్ మాలెక్ (45) ప్రమాణస్వీకారం చేశారు. ఈ పదవి చేపట్టిన తొలి ఇండియన్–అమెరికన్‌గా ఆయన చరిత్ర సృష్టించారు. ఈయన రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. ■

---

మంచిది. ఇది లేకుండా మిగిలిన అన్నీ ఉన్నా తీసుకోవచ్చు. నో క్లెయిమ్ బోనస్, సూపర్ బోనస్ ఫీచర్లు ఉండేలా చూసుకోవాలి. క్లెయిమ్ లేని సంవత్సరాల్లో కవరేజీ వీటితో పెరుగుతుంది. ఒక అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి దానికి బీమా క్లెయిమ్ వచ్చిందనుకుంటే.. ఆసుపత్రిలో చేరడానికి ముందు అయిన వ్యయాలు (ప్రీ హాస్పిటలైజేషన్), డిశ్చార్జ్ అయిన తర్వాత అయ్యే వ్యయాలు (పోస్ట్ హాస్పిటలైజేషన్) కవరేజీ కూడా ముఖ్యమే. 90–180 రోజుల వరకు ఇది ఉండేలా చూసుకోవాలి. ఇక రీస్టోరేషన్ కూడా ముఖ్యమైన ఫీచర్. అంటే ఒకరు ఆసుపత్రిలో చేరినప్పుడు వారు తీసుకున్న కవరేజీ మొత్తం అయిపోయిందనుకోండి. అప్పుడు బీమా కంపెనీ తిరిగి కవరేజీని పునరుద్ధరిస్తుంది. దీంతో అదే వ్యక్తి, లేదంటే కుటుంబంలో మరొకరు దీన్ని ఉపయోగించు కోవచ్చు. ఇలా అపరిమితంగా రీస్టోరేషన్‌ను అందించే ప్లాన్లు కూడా వచ్చాయి. దీన్నే రీలోడ్, రీ ఇన్ స్టేట్ మెంట్, బంగీ రీఫిల్ ఇలా పలు పేర్లతో పిలుస్తున్నారు.

**వెయిటింగ్ పీరియడ్**

అప్పటికే ఏవైనా వ్యాధులు ఉంటే వాటిని ప్రీ ఎగ్జిస్టింగ్‌డ్ సీజ్ గా పరిగణిస్తారు. వీటి కోసం బీమా సంస్థలు 1–4 ఏళ్ల పాటు వెయిటింగ్ పీరియడ్ పెడుతున్నాయి. అంటే పాలసీ తీసుకుని ఈ వెయిటింగ్ పీరియిడ్ ముగిసిన తర్వాతే వాటికి కవరేజీ లభిస్తుంది. తక్కువ వెయిటింగ్ పీరియడ్ ఉన్న వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. కొన్ని ఆప్షనల్ కవరేజీ కింద అదనపు ప్రీమియం తీసుకుని వెయిటింగ్ లేకుండా ఆఫర్ చేస్తున్నాయి. ఇక కొన్నింటికి 24 నెలల తర్వాతే కవరేజీ లభిస్తుంది. (ఏపీ 7 ఏఎం సౌజన్యంతో) ■

సత్యం కోసం దేనినైనా త్యజించవచ్చు, కానీ దేనికోసంకూడా సత్యాన్ని త్యజించకూడదు

# ఇకపై 'సార్...మేడమ్' కాదు ... 'టీచర్' !

సాధారణంగా పాఠశాలల్లో ఉపాధ్యాయుడిని సార్ అని, ఉపాధ్యాయిని అయితే మేడమ్ అని సంబోధిస్తుంటారు. పాఠశాలల్లోనే కాదు.. బయట కూడా పురుషులను సార్ అని, మహిళలను మేడమ్ అని గౌరవంగా పిలుస్తాం. అయితే, ఇకపై పాఠశాలల్లో ఈ రెండు పదాలు వాడొద్దని, ఇద్దర్నీ 'టీచర్' అని మాత్రమే సంబోధించాలని కేరళ బాలల హక్కుల కమిషన్ (కేరళ స్టేట్ కమీషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఛైల్డ్ రైట్స్) పేర్కొంది.

ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు మార్గదర్శకాలు జారీ చేయాల్సిందిగా సాధారణ విద్యాశాఖను ఆదేశించింది.

టీచర్ అనే పదం పురుషులకు, మహిళలకు ఇద్దరికీ వర్తిస్తుందని, విద్యార్థి దశలోనే పిల్లలకు స్త్రీ, పురుషులిద్దరూ సమానమే (లింగ, సమానత్వం)నని చెప్పేందుకే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు బాలల హక్కుల కమిషన్ తన ఆదేశాల్లో పేర్కొంది.

కేరళ స్టేట్ కమిషన్ ప్యానల్ ఛైర్ పర్సన్ కేవీ మనోజ్, విజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం.. పాఠశాలల్లో కేవలం 'టీచర్' అనే పదాన్ని మాత్రమే ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని సాధారణ విద్యాశాఖకు మార్గనిర్దేశం చేసింది. ఈ నేపథ్యంలో తాజా ఉత్తర్వులు వెలువడ్డాయి. సార్, మేడమ్ అని కాకుండా టీచర్ అని పిలవడం వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య అనుబంధం మరింతగా పెరుగుతుందని బాలల హక్కుల కమిషన్ అభిప్రాయపడింది.

'సార్ / మేడం' అనే పదాలకు స్వస్తి చెప్పాలంటూ ఓ వ్యక్తి పిటిషన్ దాఖలు చేయడంతోనే ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు కొందరు చెబుతున్నారు. తాజా ఉత్తర్వుల అమలు తీరుపై రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని బాలల హక్కుల కమిషన్ కేరళ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ■

# 'వరలక్ష్మి' పత్తి వంగడం సృష్టికర్త పాపారావు కన్నుమూత



కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింధనూరు తెలుగువారిలో అగ్రగణ్యులు, ఆదర్శరైతు కె.పాపారావు(90) హైదరాబాద్‌లో మరణించారు. పాపారావుకు లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్ సొంత అల్లుడు. పాపారావు కుమారులిద్దరూ బెంగళూరులో స్థిరపడ్డారు. ముగ్గురు కుమార్తెల్లో పెద్ద కుమార్తె రాధారాణిని జయప్రకాశ్ నారాయణ్‌కు యిచ్చి పెళ్ళి చేశారు. మరో ఇద్దరు కుమార్తెలు లతారాణి, సంధ్యారాణి. చివరి కుమార్తె ఐఆర్ఎస్ అధికారిణి.

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా నరసాయపాలెం నుంచి 1970లో వ్యవసాయం కోసం ఆయన సింధనూరు వచ్చారు. అగ్రి బీఎస్సీలో పట్టా పుచ్చుకున్న పాపారావు కర్ణాటకలో అతి తక్కువకాలంలో ఆదర్శ రైతుగా పేరు గడించారు. సింధనూరు సమీపంలోని జవళగేరి వద్ద దాదాపు 800 ఎకరాల మేరకు బీడు భూములు కొని యంత్రాలతో దున్ని సస్య శ్యామలం చేశారు. తనకున్న పరిజ్ఞానంతో 'వరలక్ష్మి' అనే కొత్త పత్తి వంగడాన్ని సృష్టించారు. 1985లో పత్తిపై ఆశించే పురుగు నియంత్రణకు మందును హెలికాప్టర్లతో పిచికారీ చేయించిన ఘనత కూడా ఆయనదే. తనవద్ద పని చేసే కూలీల సంక్షేమానికి వ్యవసాయక్షేత్రం వద్దే ఆసుపత్రి, పాఠశాల నిర్మించారు. శ్రీ పాపారావు దశాబ్దకాలంగా హైదరాబాద్‌లో తమ కుటుంబం వద్దే ఉంటున్నారు. ■

పవిత్రంగా వుంటూ ఇతరులకు మేలుచేడమే పూజలన్నింటి సారం

# మామిడిలో పూత, పిందె దశలో సస్యరక్షణ చర్యలు

మామిడి పూత, పిందె దశలో పలు రకాల చీడలు, తెగుళ్ళు ఆశిస్తాయి. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేయకపోతే తీవ్రనష్టం కలుగు చేస్తాయి.

**తేనె మంచు పురుగు**

**లక్షణాలు:**

- తల్లి పురుగులు, పిల్ల పురుగులు గుంపులుగా చేరి లేత ఆకులు, పూత కాడలు, పూలు, లేత పిందెల నుండి రసాన్ని పీలుస్తాయి.ఆకుల చివర్లు, అంచులు మాడి పోతాయి. పూత మాడిపోతుంది. పిందెలు ఏర్పడవు. ఒకవేళ ఏర్పడినా పిందెలు రాలిపోతాయి. ఈ పురుగులు విసర్జించిన తేనెలాంటి పదార్థం ఆకులపై, పూత కాడలపై, కాయలపై పడి నల్లని మసి ఏర్పడు తుంది. పూత,పిందె సమయంలో ఈ పురుగుల ఉధృతి అధికంగా వుంటుంది. మిగతా సమయాల్లో ఇవి తక్కువగా చెట్ల మొదలు, కొమ్మల బెరడులోని చీలికల్లో ఉంటాయి.
- వీటి తల్లి పురుగులు, పూ మొగ్గలపై, పూత కాడలపైన గుడ్లు పెడతాయి. ఒక్కో తల్లి పురుగు 200 గుడ్లు పెడుతుంది. 4-7 రోజులకు గుడ్లు పగిలి పిల్ల పురుగులు బయటకి వస్తాయి. పిల్ల పురుగులు బాగా హుషారుగా ఉంటాయి.

**నివారణ**

- కోత అనంతరం గుబురుగా, అడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించి తద్వారా గాలి వెలుతురు ప్రసరించేలా చేయాలి.
- తేనె మంచు పురుగు నివారణకు మొదటి పిచికారిలో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 17.8% ఎస్ఎల్ @ 0.4 ఎంఎల్/ఎల్ లేదా లాంబ్డా సైహాలోథిన్ 5 ఇ @ 0.5-1.0 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పురుగు ఉధృతి కొనసాగితే 15-20 రోజుల తరువాత, లీటరుకు థయోమిథాక్సిమ్ 25 డబ్ల్యుజి@ 0.3 గ్రాములు కలిపి పిచికారి చేయాలి. మరియు ఇంకా నష్టం కొనసాగితే, బుప్రోఫెజిన్ 25ఎస్సి @ 1.2 మి.లీ/లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తామర పురుగులు (త్రిప్)**

- పిల్ల పురుగులు ప్రౌఢ పురుగులు కొత్త చిగుర్లు పుట్టే దశలో ఆకులపై చేరి ఆకుల్ని గోకి రసాన్ని పిలుస్తాయి. దీనివల్ల చిగురు అకులు చిన్నవిగా మారి తరువాత



రాలుతాయి. పిందె ఏర్పడే దశలో తోలుపై గోకి రసాన్ని పీలుస్తాయి. ఇవి ఆశించిన కాయలపై రాతి మంగు ఏర్పడి కాయల నాణ్యత దెబ్బ తింటుంది.

**నివారణ**

- కోత అనంతరం గుబురుగా అడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించి తద్వారా గాలి వెలుతురు ప్రసరించేలా చేయాలి.
- సమర్థవంతమైన నిర్వహణ కోసం అసిఫేట్ 75 డబ్ల్యుపి 1 గ్రా / లీటరుకు మరియు పురుగు ఉధృతి కొనసాగితే 15-20 రోజుల తర్వాత, ఫిప్రోనిల్ 5ఎస్సి @ 2 ఎంఎల్ / లీటరుకు మరియు ఇంకనూ నష్టం కొనసాగితే, స్పైనోసాడ్ 45% ఎస్సి @ 0.3 ఎంఎల్/ నీటికి కలిపి పిచికారీ చేయాలి. @ 7.5 గ్రా కానుగనోపు

(పొంగేమియా సోపు) లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**పండు ఈగ**

- మామిడి రాయలు పక్వదశకు చేరువ అయ్యే సమయంలో లేత గోధుమరంగులో పారదర్శకమైన రెక్కలు కలిగిన తల్లి ఈగ 150-200 గుడ్లను కాయ తోలు లోపలి భాగంలో 2 నుండి 15 గుడ్ల సమూహంలో పెడుతుంది. 1-3 రోజుల్లో పిల్ల పురుగులు బయటకు వచ్చి కాయల్లోనికి చొచ్చుకొనిపోయి కాయల లోపల గుజ్జు తింటూ 6-15 రోజులు పిల్ల పురుగు (లార్వా) దశను పూర్తి చేస్తాయి. ఇవి తింటూ తిరిగిన కాయ లోపలి భాగం కుళ్ళుతుంది. కాయలను వత్తితే చెడు వాసన కలిగిన రసం రంధ్రాల గుండా బయటకు వస్తుంది. దశను 6-44 రోజులు గడిపి రెక్కల పురుగులు నేలనుండి బయటకు వస్తాయి. కోతకు ఆలస్యంగా వచ్చే రకాలకు వేసవిలో వర్షాలు కురిసినప్పుడు వీటి బెడద ఎక్కువగా ఉంటుంది.
- మిథైల్ యూజీనాల్ కలిగిన లింగాకర్షక బుట్టలను భూమినుండి 5-6 అడుగుల ఆ ఎత్తులో ఎకరానికి 6-8 అమర్చుకోవాలి.
- తల్లి పురుగు నివారణకు లీటరు నీటికి 100 గ్రా బెల్లం + 2 మి.లీ. డెల్టామెథ్రిన్ 2.8 ఇసి కలిసి విషపు ఎర తయారుచేసి పొలంలో అక్కడక్కడ అమర్చాలి. పంటకోత తరువాత ప్యూపా / కోశస్థ దశను నాశనం చేయటానికి లోతుగా దుక్కి దున్నుకోవాలి.

**పూత మాడు తెగులు:**

- వాతావరణం తేమగా, మంచు పడే సమయాల్లో పూలకాడలపై, పూలపై సూక్ష్మమైన నల్లని మచ్చలు ఏర్పడతాయి. ఈ తెగులు ఆశించిన పూల భాగాలు పాక్షికంగా గానీ, పూర్తిగా గానీ ఎండి రాలిపోతాయి. ఈ దశలో ఈ తెగులును పూత మాడు తెగులు అని అంటారు. ఈ తెగులు ఆకులకు, రెమ్మలకు కాయలకు కూడా సోకుతుంది.

**నివారణ**

- ఎండిన కొమ్మలను ఆకులను తొలగించి పండ్లతోటలను శుభ్రంగా ఉంచుకోవాలి. కొమ్మలు కత్తిరింపు వలన తెగుళ్ళ ఉధృతిని తగ్గించవచ్చు.
- చెట్లకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 50% డబ్ల్యుపి@3.0కి గ్రా/ లీటరుకు పిచికారీ చేయడం లేదా కార్బండమ్ + మాంకోజెబ్ 2.00/)లేదా అజోక్సిస్ట్రోబిన్23 ఎస్‌సి@1 మి.లీ లేదా ట్రైబుకోనజోల్ + 50% ట్రైఫ్లెక్సిస్ట్రోబిన్ 25%డబ్ల్యు + @ 1 గ్రా/ఎల్ నీటికి పూత సమయంలో 15 రోజుల విరామంతో 2 సార్లు స్ప్రే చేయలి.

**బూడిద తెగులు**

- ఈ తెగులు సోకిన భాగాలపైన బూడిద రంగుపొడి ఏర్పడుతుంది. ఈ పొడిలో శిలీంధ్ర బీజాలుంటాయి. ముందుగా తెగులు లక్షణాలు పూల కాడల చివర్లలో మొదలై క్రమంగా క్రిందకు వ్యాపించి, చివరి ఆకులకు సైతం వ్యాపిస్తుంది. తెగులు సోకిన పూగుత్తుల్లో పూలు ఫలదీకరణం చెందకుండా రాలిపోతాయి. ఈ తెగులు లేత పిందెలపైన కూడా కనబడుతుంది. తెగులు సోకిన పిందెలు రాలుతాయి. వెచ్చని పగలు, చల్లనిరాత్రిళ్లు మేఘావృతమైన వాతావరణం, పొగమంచు ఈ తెగులు వ్యాప్తికి మిక్కిలి అనుకూలం.

**నివారణ**

- ముందస్తు జాగ్రత్తగా బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే సల్ఫర్ 80 డబ్ల్యుపి లీటరుకు 3 గ్రా కలిపి పిచికారి చేయాలి.
- పూతకాడ ఏర్పడే సమయంలో హెక్సకానోజోల్ 5ఎస్‌సి @2 ఎంఎల్/ఎల్ లేదా పెన్‌కోనోజోల్ 10ఇసి@ 0.5 ఎంఎల్/ఎల్ లేదా టెట్రాకోనోజోల్ 3.8 ఇడబ్ల్యు @ 1.25 ఎంఎల్/ఎల్ లేదా మైక్లోబుటానిల్ 10 డబ్ల్యు పి%@ 0.5-1.0 గ్రా/ఎల్ లేదా ప్రక్సాపైరోక్సాడ్ 250 జి/ఎల్+పైరాక్లోస్ట్రోబిన్ 250 జి/ఎల్ఎస్‌సి@ 0.5-0.2 ఎంఎల్/ఎల్ 15-20 రోజుల విరామంలో పిచికారి చేయాలి.

ఏ పరిస్థితులలో వున్నా నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగవలసిన పనులు అవే జరిగి పోతాయి

**మామిడిలో పూ మొగ్గ దశ నుండి గోళీకాయ దశ వరకు నెలవారీగా చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు**

| **పూత, కాయ దశ** | **ఆశించే చీడపీడలు** | **సస్యరక్షణ చర్యలు** |
|---|---|---|
| పూ మొగ్గ దశ (మొదటి పిచికారి) | తేనె మంచు పురుగు –మసి తెగులు, పక్షికన్ను తెగులు, బూడిద తెగులు | మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ/ లేదా క్లోరోపైరిఫాస్ 2.0 మి.లీ + గంధకం 2.5 గ్రా లేదా మ్యాంకోజెట్ 2 గ్రా/ లీటరు నీటికి |
| పచ్చి పూత దశ (రెండవ పిచికారి) | తేనె మంచు పురుగు, ఆంత్రక్నోస్ బూడిద తెగులు | ఇమిడాక్లోప్రిడ్ 0.4 మి.లీ + హెక్సాకొనోజోల్ 2 మి.లీ + అజిడిరిక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా + ( 1500 పిపిఎం 2 మిల్లీ/లీ + ప్లానోఫిక్స్ 0.20 మిలీ /లీటరు నీటికి |
| నల్ల పూత దశ (మూడవ పిచికారి) | తేనె మంచు పురుగు, తామర పురుగులు బూడిద తెగులు, పక్షి కన్ను తెగులు | థయోమిథాక్సమ్ 0.3 గ్రా + థయోఫినేట్ మిథైల్ 1 గ్రా లేదా ఎమామిక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా + కార్బెండిజిమ్ + మాంకోజెట్ 2.0)+ప్లానోఫిక్స్ 0.20 మిలీ లీటరు నీటికి |
| గోళీ కాయ దశ నుండి నిమ్మకాయ దశ | తొడమ కుళ్ళు తెగులు | అజోక్సిస్ట్రోబిన్ 1 మి.లీ లేదా నేటివో @1 గ్రా లీటరు నీటికి |



మామిడి పిందెలు గోళీకాయ నుండి నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు 10 సం॥లు పైబడిన చెట్లకు రెండవసారి ఎరువులు, యూరియా 1కేజి, పొటాష్ 750 గ్రా॥ చెట్టుకు చొప్పున భూమిలో వేసి ఫిబ్రవరి, మార్చి నెలలో నీటి తడులను 15 రోజుల కొకసారి ఇవ్వాలి. డ్రిప్ సౌకర్యం ఉన్న రైతులు ప్రతి రోజు చెట్టుకు 60–90 లీ॥ నీటిని ఇవ్వవలెను.

**కాయలకు కవర్లు తొడగడం**

మామిడి కాయలు పెద్ద నిమ్మకాయ సైజు వున్నప్పుడు కాయలకు కవర్లు వాడటం వలన నాణ్యమైన కాయలను పొంది, ఎగుమతి చేయడంవల్ల అధిక ధర లభిస్తుంది. అలాగే పండు ఈగ, కాయతొలుచు పురుగులను నివారించవచ్చు. మామిడి కాయలను ఎక్కువ కాలం చెట్టుపై నిల్వ చేసి మంచి ధర వచ్చినప్పుడు అమ్మడానికి వీలు అవుతుంది.

**గమనిక:** తెల్ల పూత దశలో అనగా పూలు విచ్చు కున్నప్పుడు రసాయన మందులను పిచికారి చేయకూడదు. ఎందుకంటే పరాగ సంపర్కానికి దోహదపడే ఈగలు, తేనెలు చనిపోవడం, వాసనకు పూల దగ్గరకు రాకుండడం జరుగుతుంది.

**(మరిన్ని వివరాలకు దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్ర ఇన్‌ఛార్జ్‌ను / ఉద్యాన అధికారులను సంప్రదించవచ్చు –జిల్లా ఉద్యానాధికారి, చిత్తూరు)**

■

# ఎగుమతుల స్థాయికి ఎదుగుతున్న ఎఫ్ పి ఓ !

*వ్యవసాయ రంగంలో లాభాల గుట్టు పట్టాలన్న ఓ యువరైతు ఆలోచన తోటి రైతులను సైతం జట్టు కట్టేలా చేసింది. ఒక్కొక్కరుగా చేయి కలుపుతూ, ఎఫ్ పి ఓ గా ఏర్పడి, ఆ రైతులంతా దళారులను తరిమికొట్టి, సాగులో లాభాల పంట పండిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సాంకేతిక పద్ధతుల్ని అవలంబిస్తూ, తమకు అవసరమైన సదుపాయాలను తామే సమకూర్చుకుంటున్నారు. విదేశాలకు ఎగుమతులు చేయడానికి సిద్ధమవుతున్నామని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు. ఇది పొలంబడుల్లో ప్రగతి దారులు పరుచుకుంటున్న నెల్లూరు జిల్లా లేగుంటపాడు రైతుల విజయగాధ ! ఆ వివరాలను తెలుసుకుందాం ...*

---

నెల్లూరు జిల్లా కోవూరు మండలం లేగుంటపాడు గ్రామానికి చెందిన రైతులు 2016లో చేయిచేయి కలిపి సంఘటితమయ్యారు. ఎంబీఏ చదివిన యువరైతు భూపేష్ రెడ్డితో కలిసి నాబార్డు సహకారంతో రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్‌పిఓ) తరపున 'ప్రగతి యువ కేంద్రాన్ని' ఏర్పాటు చేశారు. తొలుత 20 ఎకరాల పొలంతో 130 మంది రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు కాగా తర్వాత కోవూరు మండలంతోపాటు, ఇందుకూరుపేట మండలంలోని పల్లెపాడు, జగదేవీపేట, కొత్తూరు, లేబూరు, కొడవలూరు మండలంలోని తలమంచి గ్రామ రైతులు కూడా వారితో జత కలిశారు. ఇలా దాదాపు 2,500 మంది పండ్లు, పూలు, కూరగాయలు సాగు చేసే రైతులు ఎఫ్‌పిఓలో సభ్యులుగా చేరారు.

ఒక్కో సభ్యుడు రూ. 100 చొప్పున సభ్యత్వ రుసుం, రూ.వెయ్యి వంతున (షేర్ క్యాపిటల్) చెల్లించి దాదాపు రూ.25 లక్షల వరకు సమకూర్చుకున్నారు. ఆ సొమ్ముతో వసతుల కల్పన దిశగా అడుగులు వేస్తున్నారు. సభ్యుల్లో అత్యధికులు కౌలు రైతులే కావడం విశేషం.

**యంత్రాల బాటపట్టి....**

ఉద్యానశాఖ, నాబార్డ్ ద్వారా సబ్సిడీ రుణం పొంది రవాణా వాహనాన్ని, తూకంలో మోసపోకుండా విద్యుత్ తూకం యంత్రాలను, వీడర్లను సమకూర్చుకున్నారు. అంతేకాకుండా కలెక్షన్ సెంటర్లు, సోలార్ కోల్డ్ రూమ్, సోలార్ డ్రయ్యర్, పోర్టబుల్ కోల్డ్ స్టోరేజ్ యూనిట్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలను సైతం సమకూర్చుకున్నారు. సోలార్ కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి దాదాపు రూ.14.5 లక్షల వ్యయం కాగా ప్రభుత్వం 11లక్షల సబ్సిడీ ఇచ్చింది. రైతులకు కొత్త వంగడాలు అందించడం, గిట్టుబాటు ధరకే పంట ఉత్పత్తులు అమ్ముకునేలా అధికారులు అవకాశం, కల్పిస్తున్నారు. ఒకవేళ పంట ఉత్పత్తులకు ధర లేకపోయినా కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వచేసి ధర వచ్చినపుడే మార్కెట్‌కు పంపిస్తున్నారు.

**జేఎల్‌జీ గ్రూపులకు రుణ సదుపాయం**

ఐదుగురు చొప్పున రైతులను జాయింట్ లయబిలిటీ గ్రూపులుగా (జెఎల్‌జీ) ఏర్పాటుచేసి, అధికారులు వారికి రుణాలు అందేలా సహకారం అందిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 500 గ్రూపులను ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రూపునకు రూ.5 లక్షల వరకు పెట్టుబడుల కోసం రుణం మంజూరు చేయిస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులకు గ్రీన్ హౌస్ టెక్నాలజీ అందించేందుకు కృషి జరుగుతోంది. 10 సెంట్ల విస్తీర్ణంలో సైతం రూ. లక్ష వ్యయంతో ఇజ్రాయెల్ టెక్నాలజీ ఉపయోగించి పంటల సాగు చేసేలా కృషి చేస్తున్నారు.

**విదేశాలకు ఎగుమతులుచేయాలనేది మా లక్ష్యం...**

రైతులకు అన్ని అవసరాలు తీర్చడంతో పాటు రైతులే సొంతంగా మార్కెటింగ్ చేసుకునే స్థాయికి చేరుకున్నాం. ఆధునిక పద్ధతులతో సేంద్రియ పంటలు పండించే పరిస్థితి తీసుకొచ్చాం. ప్రభుత్వ సహకారంతో పంట ఉత్పత్తులు నిల్వ

# ఎఫ్ పి ఓ లతో రైతుల సమగ్రాభివృద్ధి

రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో ఆర్థిక పరిపుష్టి జరుగుతుందని అమూల్ డైరీ లాగా జిల్లాలో కూడా రైతు ఉత్పత్తి సంఘాలు అభివృద్ధి కావాలని రైతుల సమగ్ర అభివృద్ధికి ఎఫ్‌పిఒలు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జిల్లా పైలెట్ కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించబడింది. ఈ సమావేశంలో జపాన్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజెన్సీ ద్వారా నిధులు కేటాయించబడే ఎపిఐ ఎల్ఐపి ప్రాజెక్టు ద్వారా రైతులకు ఆదాయాన్ని పెంపొందించే విధంగా చేపట్టబడిన వివిధ పైలెట్ ప్రాజెక్టుల గురించి చర్చించారు.

సమావేశానికి రైతు ఉత్పత్తి సంఘం సిద్దేశ్వర రైతు సంఘం, నిమ్మనపల్లి రైతు ఉత్పత్తి సంఘం, మర్యాద రామన్న రైతు ఉత్పత్తి సంఘాలకు సంబంధించిన ప్రెసిడెంట్లు, సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో జరుగుతున్న మామిడి టమాటా తదితర ఫుడ్ ప్రాసెసింగ్‌ల గురించి రైతు ఉత్పత్తి సంఘాలతో చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఆదాయాన్ని పెంచుకోవడానికి ఫుడ్ ప్రాసెసింగ్ అనేది చాలా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మన జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా టమాట, మామిడి తదితర వాటిని ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా మంచి ఉత్పత్తులుగా మార్చడానికి అవకాశం ఉంటుందని అన్నారు. పెద్దపెద్ద ఇంటర్నేషనల్ కంపెనీలతో రైతులు ఒప్పందాలు కుదుర్చుకొని ఆదాయాన్ని రెట్టింపు లేదా మూడురెట్లు పైగా సంపాదించవచ్చని అన్నారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్‌ని పెంపొందించి రాష్ట్రంలోనే జిల్లా రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. మొదటిసారిగా కలెక్టర్ ఎఫ్‌పిఓలతో సమావేశమైన సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. సమావేశానికి జిల్లా హార్టికల్చర్ అధికారి రవిచంద్ర, హార్టికల్చర్ అధికారులు, రైతులు, పాల్గొన్నారు.

---

చేసుకునేందుకు సోలార్ కోల్డ్ స్టోరేజీలు, మార్కెటింగ్ కోసం వారాంతపు సంత ఏర్పాటు చేసుకున్నాం. విదేశాలకు ఎగుమతులు చేయాలనే లక్ష్యంతో ఉన్నాం.

*– భూపేష్ రెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘ రూపకర్త*

**ఆధునిక పద్ధతులతో సాగు**

రైతులంతా ఐకమత్యంతో రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరాం. మాకు పంటల సాగుపై శిక్షణ కూడా ఇస్తున్నారు. ఆధునిక పద్ధతులతో సాగుచేస్తున్నాం. ఏటా భూసార పరీక్షలు చేయించి అవసరమైన ఎరువులు మాత్రమే వాడుతున్నాం. దీనివల్ల పంటల దిగుబడి పెరిగి వ్యయం తగ్గింది.

*– రాజశేఖర్, యువ రైతు, లేగుంటపాడు*

■

## కలెక్షన్ సెంటర్ తనిఖీ

**తం**బళ్ళపల్లి మండలంలోని కామధేను ఎఫ్‌పిఓ వారికీ ఉద్యానవన శాఖ ద్వారా మంజూరైనా 15 లక్షలతో నిర్మిస్తున్నా కలెక్షన్ సెంటర్ పనులను అన్నమయ్య జిల్లా ఉద్యానవన శాఖ జిల్లా అధికారి రవిచంద్రబాబు తనిఖీ చేసి, పనులు జరిగే విధానం పరిశీలించారు. పనులు, పనితీరు, నాణ్యతను చూసిన సంతోషం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పిఓ ద్వారా రైతులకు ఎరువు అమ్మకాలు కూడా విక్రయించవచ్చని, అలాగే నర్సరీ సౌకర్యం కల్పించవచ్చని ఆయన తెలిపారు. కలెక్షన్ సెంటర్ పనుల్లో వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇప్పుడు వరకు జరిగిన పనులుకో నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తంబళ్ళపల్లి హెచ్ఓ తేజస్వినిరెడ్డి ఎపిఎంఏఎస్ ప్రాజెక్ట్ మేనేజర్ డా గంగాద్రి పాల్గొన్నారు. ఎఫ్‌పిఓసి ఈఓ అమరనాధ్ రెడ్డి, కార్యదర్శి పెద్దరెడ్డప రెడ్డి, కోశాధికారి రఘురామిరెడ్డి డైరక్టర్ శ్రీ పి. నాగేశ్వరరావు, కృష్ణమూర్తి రెడ్డి, సంఘ రైతులు పాల్గొన్నారు.

■

# ఆదిలాబాద్ జిల్లాలో ఎఫ్ పి ఓల ఏర్పాటులో స్తబ్దత

తెలంగాణా రాష్ట్రం,ఆదిలాబాద్ జిల్లా, సిరికొండ మండలంలో గత యాసంగిలో రైతులు పండించిన శనగపంటను రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్ పి ఓ) కొనుగోలుచేసి , సొంతంగా మార్కెటింగ్ చేసుకుంది. ఇలా వచ్చిన లాభాన్ని సంఘంలోని రైతులు తీసుకున్నారు. విత్తనాలు, ఎరువులు కంపెనీలతో నేరుగా ఒప్పందం చేసుకొని రవాణా చేసుకోవడంతో మార్కెట్లో కన్నా తక్కువ ధరతో విత్తనాలు, ఎరువులు పొందుతున్నారు.

జైనథ్‌లో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారు సంఘం ప్రతి నెల సమావేశమై సాగుస్యలతో పాటు, అవసరాలను చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. గతేడాది నుంచి విత్తనాలు, ఎరువులను నేరుగా రవాణా చేసుకుంటున్నారు. ఈ సీజన్‌లో సంబంధిత రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి నేరుగా మార్కెటింగ్ చేసేందుకు కార్యాచరణ రూపొందించారు..

| జిల్లా | మండలాలు | ఎఫ్‌పీవోలు |
|---|---|---|
| ఆదిలాబాద్ | 18 | 08 |
| నిర్మల్ | 19 | 07 |
| కుమురం భీం | 15 | 03 |
| మంచిర్యాల | 18 | 03 |

అంతా ఒక్కటై కృషి చేస్తే ఏదైనా సాధ్యమవుతుంది. వ్యవసాయంలో ఆదాయం రెట్టింపు చేసేందుకు సన్న, చిన్నకారు రైతులను సంఘటితం చేసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పిఓ) ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

దేశవ్యాప్తంగా 2023 లోపు 10 వేల సంఘాలను కేంద్రం లక్ష్యం నిర్దేశించింది. జిల్లాలో నాబార్డు, స్వచ్ఛంద సంస్థలు, నాఫెడ్, చిన్నరైతుల వ్యవసాయ వాణిజ్య సమాఖ్య ఆధ్వర్యంలో ఎఫ్‌పీవోలు ఏర్పాటు చేస్తున్నారు. అవగాహన కరవై, అధికారులు పట్టించుకోక, రైతులు ఆసక్తి చూపక ఉమ్మడి జిల్లాలో మండలానికొక సంఘం కూడా ఏర్పాటు కాలేదు.

ఉమ్మడి జిల్లాలో 70 మండలాలు ఉండగా, ఇప్పటివరకు 21 సంఘాలు ఏర్పాటయ్యాయి. జిల్లాల వారీగా ఏయే మండలాల్లో ఈ సంఘాలు ఏర్పాటు కాలేదనే వివరాలు భారత చిన్న రైతులు వ్యవసాయ వాణిజ్య సమాఖ్య వెల్లడించింది. జిల్లాలో ఏర్పాటైన సంఘాలు ఇప్పటికే పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలను ప్రారంభించి అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయి. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చేస్తాయి.

ఇంద్రవెల్లి రైతు ఉత్పత్తిదారు సంఘం మండలంలో తొలిసారిగా పత్తి జిన్నింగ్ ఏర్పాటు చేసి విజయవంతంగా కొనసాగిస్తోంది. జిల్లాలో ఇప్పటికే సహకార సంఘాలున్నా... రైతులకు ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదు.

**ప్రయోజనాలివీ..**

ఇందులో సభ్యులుగా ఉన్న రైతులకు విత్తనం నుంచి పంటను అమ్ము కునే వరకు సంఘం చేదోడుగా ఉంటుంది. విత్తనాలు, ఎరువులు, మందులు తదితర వాటిని సంఘం సమకూరుస్తుంది. రైతుల నుంచి గిట్టుబాటు ధరతో పంట కొనుగోలు చేస్తుంది.

సంఘ స్థాపిత వ్యయం కింద 'మూడేళ్లలో రూ. 18 లక్షలను కేంద్ర ప్రభుత్వం గ్రాంటుగా ఇస్తుంది. సభ్యులకు ఈక్విటీ గ్రాంటు పేరుతో ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున గరిష్ఠంగా మరో రూ.15 లక్షలు నాబార్డు ద్వారా అందజేస్తుంది. సంఘాలు ఏర్పాటైన తర్వాత వ్యవసాయ, వాణిజ్యం చేయడానికి రూ.2 కోట్ల వరకు బ్యాంకు రుణం తీసుకోవచ్చు. వాణిజ్యం పెంచుకోవడానికి నాబార్డు అదనంగా తక్కువ వడ్డీతో రుణాలను అందిస్తుంది. ■

# పంట నష్టం కష్టాలు తీర్చే 'ఇ-క్రాప్' !

ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్ర కష్టాలను చవిచూస్తున్న రైతులకు 'ఇ-క్రాప్' నమోదుతో ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. పంటలు నష్టపోతున్న రైతులకు ఇ-క్రాప్ వరంగా మారుతోంది. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభం కావడంతో ఉద్యాన వ్యవసాయ అధికారులు ఉమ్మడిగా ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ చేపట్టారు. పంటలు నష్టపోతే ప్రభుత్వం సాయం అంది రైతులకు ప్రభుత్వం ఆసరా చూడటానికి గానూ వీలుంటుంది. ఇ-క్రాప్ సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో రుణాలు పొందే అవకాశం కూడా వుంది. సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు వంట నష్టపరిహారం అందనుండడం గమనార్హం.

**ప్రయోజనాలు ఇలా**

వంట సాగు చేసి ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు నేరుగా నష్టపరిహారం పొందే వెసులు బాటు ఉంటుంది. ప్రభుత్వమే పూర్తిస్థాయిలో రైతుల తరపున బీమా సొమ్ము చెల్లిస్తోంది. ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ వల్ల పంట నష్టపోయినప్పుడు నష్టపోయిన రైతు ఎంత పంట సాగుచేశాడో వివరాలు తెలుస్తాయి. నష్టపరిహారం పొందే వీలుంటుంది. వంటల వివరాలాధారంగా ఉత్పత్తులలభ్యతపై స్పష్టత వచ్చే అవకాశముంటుంది. పైగా దిగుబడుల అంచనాకిది సరైన విధానం. ఎరువులు, పురుగుల మందులు ఎంతమేరకు అవసరం అవుతాయో ఆయా పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు (ఆర్‌బీకేలకు) తెలిసే అవకాశముంది.

**రైతులకు ప్రభుత్వం ఆసరా**

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ప్రభుత్వం రబీ సాగుపై దృష్టి సారించింది. ఇందుకోసం రైతులకు ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెచ్చి , ప్రభుత్వం అసరా కల్పించింది. పంటల సాగుకోసం అవసరమైన సబ్సీడీ ఎరువులు ఆర్‌బీకేలకు సరఫరా అయ్యాయి. రైతులకు అందుబాటులోకి సబ్సిడీ ఎరువులు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కౌలు రైతులకు పరిహారం**

గతంలో పొలాన్ని కౌలు రైతులు కౌలుకు తీసుకొన్నా పంట నష్టపరిహారం మాత్రం యజమానులకే అందేది. ప్రస్తుతం ఒకసారి కౌలురైతుల గుర్తింపు కార్డులు జారీ చేస్తే ఇ-క్రాప్ నమోదులో ఆన్‌లైన్‌లో సదరు పొలం కౌలు రైతులకు ఇచ్చినట్లు చూపిస్తుంది. దీంతో పొలం యాజమానులకు కాకుండా నిజమైన కౌలురైతుల పేరు మీదే ఇ-క్రాప్ నమోదు చేస్తుండడం గమనార్హం.

**ఇ-క్రాప్ సర్టిఫికెట్‌తో పంట రుణాలు**

ప్రస్తుత రబీ సీజన్లో చేపట్టిన ఆన్‌లైన్‌లో ఇ-క్రాప్ బుకింగ్‌తో రైతులకు పంట రుణాలు కూడా మంజూరు అవుతున్నాయి. వ్యవసాయశాఖ సిబ్బంది జారీచేసే ఇ-క్రాప్ బుకింగ్ సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో కొత్తగా పంట రుణాలు మంజూరు చేయడంతోపాటు, పాత రుణాలు కూడా రెన్యూవల్ చేసేందుకు ఈ ప్రక్రియ దోహదపడుతోంది.

**కౌలు రైతులకు న్యాయం**

గతంలో ఎన్నడూ లేనివిధంగా కౌలు రైతులకు ఇ-క్రాప్ ద్వారా న్యాయం జరిగింది. వారు సాగుచేసిన వంటను పరిశీలించి పంటనమోదు చేస్తున్నారు. అర్హులైన కౌలు రైతులకు న్యాయం జరుగుతోంది. నేరుగా కౌలు రైతులకే పరిహారం ఇస్తున్నారు.

*-నరేంద్ర, కౌలురైతు, దౌలతానేపల్లె*

**రైతులకు ఈ-క్రాప్ వరం**

ఈక్రాప్ నమోదు చేసుకోవడం వలన రైతులకు ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా రైతు భరోసా, పంట నష్టపరిహారం తప్పనిసరిగా రైతులకు అందుతాయి. కౌలు రైతులకు కూడా రైతు భరోసాతో పాటు పరిహారం కూడా వస్తుంది. రైతులందరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

*- రత్నమ్మ, వ్యవసాయాధికారి, గుర్రంకొండ*

■

# ఈ సంవత్సరమంతా చిరుధాన్యాల కార్యకలాపాలు

**ఈ** ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల (మిల్లెట్స్) సంవత్సరంగా గుర్తించిన నేపథ్యంలో ఆరోగ్యం, పోషక విలువలతో కూడిన చిరుధాన్యాల సాగును ప్రోత్సహించి విస్తృత అవగాహన కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలను ఆహారంగా తీసుకునేలా ప్రచారం చేస్తూ జనవరి నుంచి డిసెంబర్ వరకు ప్రణాళిక రూపొందించింది. రైతులు, స్వయం సహాయక సంఘాలు, విద్యార్థుల్లో అవగాహన పెంపొందిస్తూ రైతులతో జిల్లాల వారీగా మిలెట్ క్లస్టర్లు, వర్క్‌షాపులు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 31 వరకు జిల్లాల వారీగా వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి... కలెక్టర్లకు మార్గనిర్దేశం చేశారు.

**పుష్కలంగా పోషకాలు**

చిరుధాన్యాల్లో 7-12 శాతం ప్రోటీన్లు, 2-5 శాతం కొవ్వు, 65-75 శాతం కార్బోహైడ్రేట్లు, 15-20 శాతం ఫైబర్, ఐరన్, జింక్, కాల్షియం ఉంటాయి. ఊబకాయం. మధుమేహం, జీవనశైలి జబ్బులు, క్యాన్సర్ లాంటి సమస్యల పరిష్కారానికి చిరుధాన్యాల వినియోగమే ఉత్తమ మార్గమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. 1970 నుంచి దేశంలో చిరుధాన్యాల దిగుబడి, సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతోంది. ఇందుకు ప్రధాన కారణం హరిత విప్లవంలో భాగంగా బియ్యం, గోధుమల ఉత్పత్తి, సాగు విస్తీర్ణం పెంచడంపై దృష్టి సారించడమే. 1962లో చిరుధాన్యాల తలసరి వినియోగం 32.9 కిలోలుండగా ఇప్పుడు 4.2 కిలోలకు పడిపోయింది.

**దిగుబడి పెంచేలా ప్రణాళిక**

దేశవ్యాప్తంగా 2022-23 ఖరీఫ్, రబీలో జొన్నలు, సజ్జలు, రాగులు, యితర తృణధాన్యాలు 205 లక్షల టన్నుల దిగుబడి సాధించాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించింది. ఏపీలో 4.87 లక్షల టన్నుల చిరుధాన్యాల ఉత్పత్తిని లక్ష్యంగా నిర్ణయించారు. తృణధాన్యాల ఉత్పత్తి పెంచడానికి జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద 14 రాష్ట్రాల్లోని 212 జిల్లాల్లో చర్యలు చేపట్టినట్లు కేంద్రం పేర్కొంది.

క్లస్టర్ ప్రదర్శనలతో పాటు పంటల విధానంపై అవగాహన కల్పించడం, అధిక దిగుబడి యిచ్చే హైబ్రిడ్ విత్తనాల పంపిణీ, వ్యవసాయ యంత్రాలు, ఉపకరణాలను రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు సమకూరుస్తున్నట్లు తెలిసింది.

## చిరుధాన్యాల సంవత్సర లోగో విడుదల

**అం**తర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ లోగోను రాష్ట్ర వ్యవసాయ శాఖ విడుదల చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజ్ఞప్తి మేరకు ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది.


ప్రపంచ చిరుధాన్యాల ఉత్పత్తిలో భారత్ ఐదో స్థానంలో ఉంది. ఈ ఉత్పత్తి పెంచేందుకు ఆంధ్రప్రదేశ్ సహా 14 రాష్ట్రాల్లోని 212 జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

దీనిపై రైతులు, ప్రజలకు అవగాహన కలిగించేలా కేంద్రప్రభుత్వం విడుదల చేసిన లోగోలో సజ్జ, జొన్న, రాగి, కంకుల నమూనాలున్నాయి. ఆంగ్లంలో ఉన్న అక్షరాలను ప్రాంతీయ భాషలలోకి మార్చి లోగో విడుదల చేస్తున్నారు. ■

# రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్.పి.ఓ)

సహకారమే పునాదిగా సంఘాల బలోపేతం
సేవలే ఆధారంగా ప్రగతి దిశలో రైతుల పయనం

## చేపట్టే పనులు




NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-2-2023 ; Posting Date: 05 & 06-2-2023

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23

## ఏపిమాస్ కార్యక్షేత్రాలలో గణతంత్ర దినోత్సవ చిత్రమాలిక !






హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో ... పెద్దవడుగూరులో ... వాల్మీకిపురంలో ... బోర్పట్లలో ...

## ఉభయ తెలుగు రాష్ట్రాల పద్మశ్రీలు ... 2023



ఎం ఎం కీరవాణి, గణేశ్ నాగప్ప, సి వి రాజు, ఆబ్బారెడ్డి నాగేశ్వరరావు, ప్రకాశ్ చంద్ర సూద్, సచ్చిదానంద శాస్త్రి, సంకురాత్రి చంద్రశేఖర్, మోదడుగు విజయ్ గుప్త, పసుపులేటి హన్మంతరావు, బి. రామకృష్ణారెడ్డి




35 మంది ఎఫ్ పి ఓ - సి ఇ ఓలకు శిక్షణానంతర చిత్రం ...జనగావ్‌లో ఎఫ్ పి ఓల పాలకవర్గ సభ్యులకు శిక్షణ





ఏ పి ఎఫ్ బృందం సమీక్షా సమావేశం ... మామిడి రైతులకు శిక్షణ ... కారవాన్ ఎంఎల్ ఏ తో పోషకాహార ప్రాజెక్ట్ బృందం

To ADDRESS



హుజూర్‌నగర్‌లో దివ్యాంగుల సంఘాలతో ...

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089